ANN తెలుగు

14-09-2026

# మహా పత్రిక

Follow: @ANNTELUGU

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 236 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బెంగళూరు సైమా వేడుకల్లో ప్రీతి రెడ్డి హంగామా

- బెంగళూరు సైమా వేడుకల్లో ప్రీతి రెడ్డి హంగామా
- స్టార్ హీరోయిన్లకు దీటుగా డిజైనర్ దుస్తులతో రెడ్ కార్పెట్‌పై హొయలు
- రూ.2కోట్ల స్పాన్సర్ షిప్ ఎమౌంట్ తో.. సైమా అవార్డ్స్ కు వచ్చిందన్న ప్రచారం

02

టాప్ న్యూస్

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

సీఎం రేవంత్



02

## పవన్ కల్యాణ్‌కు కేరళ సీఎం స్పెషల్ థ్యాంక్స్

- ఆయుర్వేద చికిత్స కోసం కేరళను ఎంచుకున్న డిప్యూటీ సీఎం



02

## తెలంగాణ ధనిక రాష్ట్రం ..అది రోశయ్య చలవే

- రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఆవిర్భావం
- రోశయ్య 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు
- సీఎం రేవంత్ రెడ్డి



02

వినాయకచవితి సందర్భంగా నేడు పత్రికకు సెలవు. పునర్దర్శనం బుధవారం

# చైనాకు బ్రిక్స్ పగ్గాలు



ఇకపై ఫలితాలు చూపించాల్సిందే

బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ



**న్యూ ఢిల్లి, మహా :** బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు తీసుకున్న నిర్ణయాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కనిపించే ఫలితాలుగా మారాలని స్పష్టం చేశారు. దిల్లీలో ఆమోదించిన డిక్లరేషన్, బ్రిక్స్ దేశాల ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆదివారం మధ్యాహ్నం మోదీ మరోసారి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చలు బ్రిక్స్‌పై తమ నమ్మకాన్ని మరింత పెంచాయని అన్నారు. బ్రిక్స్ కేవలం కొన్ని దేశాలు కలిసి పనిచేసే వేదిక మాత్రమే కాదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు వెతికే వ్యవస్థగా మారుతోందని పేర్కొన్నారు.

**ఫలితాలు కనిపించాలి**

బ్రిక్స్ సదస్సులో తీసుకున్న నిర్ణయాలను ఇకపై కాలపరిమితితో అమలు చేయాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు. నిర్ణయాలు, ప్రకటనలు కేవలం ఫైళ్లలో ఉండిపోకూడదని, ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా వాటిని అమలు చేయాలని అన్నారు. చివరి స్థాయిలోనూ ఫలితాలు కనిపించేలా కలిసి పనిచేయాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచం ఇప్పుడు బ్రిక్స్ నుంచి




## మళ్ళీ గెలుస్తా .. మంత్రినవుతా

- రాహుల్ పాదయాత్ర వల్లే గెలిచా
- రేవంతన్న మాస్ లీడర్ .. త్వరలో కొండా మురళికి పదవి
- కాంగ్రెస్ ను వీడే ప్రసక్తేలేదు
- కార్యకర్తల భేటీలో మాజీ మంత్రి కొండా సురేఖ

08



## వారణాసి టైమ్ ట్రావెల్ కాదు..

- అంతకు మించిన స్టోరీ
- మళయాళ స్టార్ పృథ్వీరాజ్



**మహా :** సూపర్‌స్టార్ మహేశ్ దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'పై ఆడియెన్స్‌లో ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం దీని షూటింగ్ మిగతా 2వ పేజీలో






# చైనాకు బ్రిక్స్ పగ్గాలు

**( మొదటి పేజీ తరువాయి )**

కేవలం ఆలోచనలు, హామీలను మాత్రమే ఆశించడం లేదని అన్నారు. స్పష్టమైన ఫలితాలను కోరుకుంటోందని, బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో ఈ అంచనాలను అందుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కీలక ఖనిజాలు, సరఫరా వ్యవస్థల విషయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సరఫరా వ్యవస్థలను మరింత నమ్మకంగా, బలంగా మార్చుకోవచ్చని తెలిపారు. కీలక ఖనిజాలు ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చాలా ముఖ్యమైనవిగా మారుతున్నాయని అన్నారు. ఇంధన భద్రతతో పాటు తక్కువ కాలుష్యంతో కూడిన సాంకేతికతల అభివృద్ధిలో వీటి పాత్ర కీలకమని చెప్పారు. వనరులు ఉన్న దేశాల హక్కులను గౌరవిస్తూ సరఫరా వ్యవస్థలను నమ్మకంగా, వైవిధ్యంగా, స్థిరంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**వైవిధ్యమే బ్రిక్స్ బలం**

వేర్వేరు దేశాలు, వేర్వేరు పరిస్థితులు ఉన్నప్పటికీ సహకారంతో ముందుకు సాగడమే బ్రిక్స్ ప్రత్యేకత అని ప్రధాని అన్నారు. వైవిధ్యమే తమ బలం అని పేర్కొన్నారు. ఈ సహకారం మానవాళికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొన్న దేశాల నేతలు, ప్రతినిధులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. వారి సూచనలు, ఆలోచనలు బ్రిక్స్ సహకారానికి మరింత బలం చేకూర్చాయని అన్నారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న చైనాకు శుభాకాంక్షలు తెలిపారు. న్యూఢిల్లీ సదస్సును విజయవంతం చేసిన అన్ని దేశాల బృందాలను అభినందించారు. ఢిల్లీ డిక్లరేషన్‌తో బ్రిక్స్ మరింత విస్తృతంగా, బలమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని మోదీ స్పష్టం చేశారు.



## బెంగళూరు సైమా వేడుకల్లో
# ప్రీతి రెడ్డి హంగామా

**స్టార్ హీరోయిన్లకు దీటుగా డిజైనర్ దుస్తులతో రెడ్ కార్పెట్‌పై హొయలు**
**రూ.2కోట్ల స్పాన్సర్ షిప్ ఎమౌంట్ తో.. సైమా అవార్డ్స్ కు వచ్చిందన్న ప్రచారం**
**మెఘా సుధారెడ్డికి ధీటుగా ఉండాలనే తాపత్రయం**

(మహా ప్రత్యేకం) : బెంగళూరులో సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) వేడుకలో మాజీమంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి హంగామా చర్చనీయాంశంగా మారింది. టాలీవుడ్, కోలీవుడ్ తారల తళుకుబెళుకుల మధ్య, రాజకీయ, వ్యాపార ప్రముఖుల హడావుడిలో తెలంగాణ మాజీ మంత్రి, సీనియర్ బీఆర్ఎస్ నేత చామకూర మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి డిజైనర్ దుస్తులతో ఎట్రాక్ట్ చేసే ప్రయత్నం చేశారు. సినీ పరిశ్రమతో నేరుగా ఎలాంటి సంబంధం లేకపోయినా, ఆమె ఈవెంట్ కు హాజరుకావడం వెనుక గ్లామర్ ఫీల్డ్ లో.. ఇండియాలోని అగ్రశ్రేణి ఈవెంట్లలో పారిశ్రామికవేత్త మెఘా కంపెనీల యాజమానురాలు సుధారెడ్డికి ధీటుగా ఆకర్షించేలా ఎదగాలని తపన పడుతున్నట్లు పరిశ్రమవర్గాలు చర్చించుకుంటున్నాయి. గ్లామర్ ఫీల్డ్ కు దగ్గరై.. పాపులారిటీ పెంచుకుని వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీచేయాలని, ఆ తర్వాత రాజకీయ పరపతితో తెలుగురాష్ట్రాల్లో, సౌత్ ఇండియాలో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ కావాలని ప్రీతి తరచూ గ్లామర్ షో చేస్తున్నట్లు కనబడుతున్నది. తాజాగా సైమా అవార్డ్స్ ఈవెంట్ కు కూడా రూ.2కోట్లకు పైగా స్పాన్సర్ షిప్ ఎమౌంట్ చెల్లించి మరీ హాజరైనట్లు పరిశ్రమవర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.

**విద్య తక్కువ.. షో ఎక్కువ**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని మల్లారెడ్డి విద్యా సంస్థల్లో తరచూ సినిమా ఈవెంట్లు, షూటింగ్‌లు జరుగుతుంటాయి. పాలమ్మిన పూలమ్మిన అని చెప్పే మల్లారెడ్డి.. చదువును కూడా అమ్ముతూ.. నాణ్యతకంటే హంగామా, యువతను పక్కదారిపట్టించే ఈవెంట్లకే పెద్దపీట వేస్తారన్న ప్రచారముంది. ఏమైనా చేసి పాపులర్ కావాలన్న గోల్ పెట్టుకున్న ప్రీతిరెడ్డి మెఘా సుధారెడ్డి టార్గెట్ గా ముందుకు కదులుతున్నట్లు చెప్పుకుంటున్నారు. సైమా ఈవెంట్‌కు హాజరైన ప్రీతి రెడ్డి.. ఖరీదైన డిజైనర్ దుస్తుల్లో, స్టార్ హీరోయిన్ల తరహాలో రెడ్ కార్పెట్ పై నడిచారు. ఆమె హొయలు, కెమెరాలకు ఇచ్చిన ఫోజులు చూసి అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. సాధారణంగా టాప్ హీరోయిన్లకు ఉండే స్పెషల్ ట్రీట్ మెంట్.. ఇండస్ట్రీతో సంబంధంలేని ప్రీతికి దక్కడం వెనుక స్పాన్సర్ షిప్ గాలం ఉన్నట్లు చెబుతున్నారు. ఒక రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన మహిళ, ఫ్యాషన్ ప్రపంచంలో సంచలనం సృష్టించడంపై సినీ వర్గాలు కూడా ఇటువైపు దృష్టి సారించాయి. ప్రీతి రెడ్డి సైమా ఎంట్రీ ఊహించని విధంగా ఓ ఫ్యాషన్ స్టేట్ మెంట్‌గా నిలిచిపోయింది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్లారెడ్డి కాలేజీల ఎకౌంట్లలో రూ.400కోట్ల నగదు నిల్వ చూసి అధికారులు షాకయ్యారని, అది లేని విద్యార్థుల పేరుతో తీసుకున్న సొమ్మా.. బ్లాక్ మనీనా? విద్యను వ్యాపారం చేయమని.. సేవచేస్తామని చెప్పి ఇలా వందలకోట్లు ఎక్కడినుండి వస్తున్నాయని ప్రశ్నించారు.

# తెలంగాణ ధనిక రాష్ట్రం.. అది రోశయ్య చలవే

**సీఎం రేవంత్ రెడ్డి**



**మహా :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్ తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రోశయ్య ముందుచూపు వల్లే 2014 జూన్ 2న తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడిందని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెన్నారెడ్డి, విజయభాస్కర రెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి వంటి ముఖ్యమంత్రులు రాష్ట్ర ఖజానా బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగించారని తెలిపారు. రోశయ్య అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను శాసనమండలిలో దూకుడుగా మాట్లాడినప్పుడు, రోశయ్య తనను పక్కకు పిలిచి కోపాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటావని సలహా ఇచ్చారని వెల్లడించారు. రోశయ్య ఎప్పుడూ కఠినంగా విమర్శించలేదని, తన చతురత, వాగ్ధాటితోనే పదునైన వ్యాఖ్యలు చేసేవారని అన్నారు. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటును కొందరు విమర్శించారని, కానీ నాలుగు దశాబ్దాల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి, కష్టసుఖాల్లో ఇక్కడే ఉంటానని చెప్పిన ఆయన మాటకు గౌరవమిచ్చి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్యవైశ్యులు సౌమ్యులని, ఆత్మగౌరవం, ముందుచూపు, విజ్ఞత వారి డీఎన్ఏలోనే ఉన్నాయని సీఎం ప్రశంసించారు. ఎంతోమంది పేదరికంలో ఉన్నా, ఆత్మగౌరవానికి విలువిచ్చి తమను పేదవారిగా చెప్పుకోవడానికి ఇష్టపడరని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు ఆర్యవైశ్య వర్గానికి చెందినవారేనని గుర్తుచేశారు. ఆర్యవైశ్యులకు దక్కాల్సినంత గుర్తింపు రాలేదని పేర్కొన్న సీఎం, ఈ ఆత్మగౌరవ భవనం పేద ఆర్యవైశ్యుల అవసరాలు తీర్చాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## పంజాబ్ రాజకీయ రంగం
# సచిన్ పైలట్ ఎంట్రీతో ఆప్ షేక్

- **పరుగులు పెడుతున్న కేజ్రీవాల్.. కాంగ్రెస్ శ్రేణుల ఐక్యతారాగం**
- **2027 ఫిబ్రవరిలో ఎన్నికలు.. 117 సీట్లలో మెజారిటీపై గురి**



**మహా ప్రత్యేకం :** రాబోయే 2027 ఫిబ్రవరిలో జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు రాజకీయ వేడి తారాస్థాయికి చేరుకుంటోంది. మొత్తం 117 స్థానాలు ఉన్న పంజాబ్ అసెంబ్లీలో అధికారం దక్కించుకోవడానికి మ్యాజిక్ ఫిగర్ 59 సీట్లు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తమ ప్రాభవాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ సరికొత్త వ్యూహాలతో పునరుత్తేజం పొందుతోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్ర బాధ్యతలను యువనేత సచిన్ పైలట్‌కు అప్పగించడం రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది.

**సచిన్ పైలట్ ఎంట్రీతో కాంగ్రెస్ లో జోష్**

సచిన్ పైలట్ పంజాబ్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే పార్టీలో సరికొత్త జోష్ వచ్చింది. 2027 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముందుగా ఎలాంటి ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించబోదని పైలట్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎన్నికలకు వెళ్లనున్నట్లు, మెజారిటీ వచ్చిన తర్వాత శాసనసభా పక్షం సీఎం అభ్యర్థిని ఎన్నుకుంటుందని తేల్చిచెప్పారు. ఇది అంతర్గత కుమ్ములాటలకు తాత్కాలికంగా అడ్డుకట్ట వేసింది. ఏ నేత అయితే తమ రీజియన్ నుంచి పార్టీకి అత్యధిక సీట్లు తెచ్చిపెడతారో, వారే సీఎం రేసులో ముందుంటారనే స్పష్టమైన సందేశాన్ని పైలట్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే స్థానిక దిగ్గజాలకు ఇచ్చారు.

**ఆప్ ప్రభుత్వ వైఫల్యాలు - కాంగ్రెస్ ప్రధాన అస్త్రాలు**

భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత క్రమంగా పెరుగుతుండటాన్ని కాంగ్రెస్ గట్టిగా క్యాష్ చేసుకుంటోంది. ప్రధానంగా శాంతిభద్రతల క్షీణత , మాదకద్రవ్యాల నిరోధంలో వైఫల్యం ను ఎండగడుతోంది. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. సామాన్య ప్రజలు, యువత ఈ వ్యూహంతో తీవ్రంగా నష్టపోతున్నారనే అంశాన్ని కాంగ్రెస్ ప్రచారాస్త్రంగా మలచుకుంది.

విద్యా, వైద్య రంగాల డొల్లతనం: ఆప్ సర్కార్ ప్రచారం చేసుకుంటున్న 'ఢిల్లీపంజాబ్ మోడల్' విద్య మరియు ఆరోగ్య రంగాలు క్షేత్రస్థాయిలో విఫలమయ్యాయని, ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులు లేక వెనుకబడ్డాయని కాంగ్రెస్ నిరూపిస్తోంది.

ఉద్యోగ సంఘాల అసంతృప్తి: రకరకాల ఉద్యోగ వర్గాలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవ్వడం ఆప్‌కు పెద్ద తలనొప్పిగా మారింది.

**కాంగ్రెస్ ప్రధానంగా దృష్టి సారించాల్సిన కీలక ప్రాంతాలు**

పంజాబ్ భౌగోళికంగా మరియు సామాజికంగా మూడు ప్రధాన ప్రాంతాలుగా చీలి ఉంది. కాంగ్రెస్ విజయం సాధించాలంటే ఈ బెల్ట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి:

**మల్వా ( 69 సీట్లు):** పంజాబ్‌లో అత్యంత కీలకమైన మరియు అతిపెద్ద ప్రాంతం. గత 2022 ఎన్నికల్లో ఆప్ అఖండ విజయం సాధించడానికి మల్వా ప్రాంతమే ప్రధాన కారణం. ఇక్కడ ఆప్ ప్రభావాన్ని తగ్గించకుండా కాంగ్రెస్ అధికారంలోకి రావడం అసాధ్యం. దళితులు మరియు గ్రామీణ ఓటర్లు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంపై పైలట్ ప్రత్యేక నజర పెట్టారు.

**మజ్జా (25 సీట్లు):** సంప్రదాయకంగా కాంగ్రెస్ మరియు అకాలీదళ్‌కు పట్టున్న ప్రాంతం. ఇక్కడ పార్టీని బలోపేతం చేయడం ద్వారా గట్టి సంఖ్యాబలాన్ని సాధించవచ్చు.

**దోబా ( 23 సీట్లు):** ఎస్సీ జనాభా అత్యధికంగా ఉన్న ప్రాంతం. పంజాబ్‌లోని మొత్తం 34 రిజర్వ్డ్ నియోజకవర్గాల్లో సింహభాగం ఇక్కడే ఉన్నాయి. దళిత ఓటర్లను ఆకర్షించడం ద్వారా కాంగ్రెస్ తన విజయ అవకాశాలను మెరుగుపరుచుకోవాలని చూస్తోంది.

**ఎన్నికల సమీకరణాలు**

2027 పంజాబ్ ఎన్నికలు కేవలం ద్వైపాక్షిక పోరులా కాకుండా అత్యంత రసవత్తరమైన బహుముఖ పోటీగా మారే అవకాశం ఉంది:

**1. ఆప్ :** అధికారంలో ఉన్న పార్టీగా సంక్షేమ పథకాలను నమ్ముకుంటూనే, మరోసారి గెలవాలనే పట్టుదలతో ఉంది.

**2. కాంగ్రెస్ :** సచిన్ పైలట్ ఎంట్రీతో పునరుత్తేజం పొంది, ఆప్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రభుత్వాన్ని గద్దె దించాలని చూస్తోంది.

3. శిరోమణి అకాలీదళ్ మరియు బీజేపీ:** తమ కోల్పోయిన పట్టును నిలబెట్టుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అలాగే కొన్ని ప్రాంతాలలో కొత్త వర్గాల ప్రాబల్యం కూడా ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. మొత్తానికి, సచిన్ పైలట్ దూకుడుతో పంజాబ్ కాంగ్రెస్‌లో కుదుపులు తగ్గి ఐక్యత కనిపిస్తుండటం ఆప్ శిబిరంలో గుబులు పుట్టిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ రాజకీయం మరింత రంజుగా మారనుంది.

# వారణాసి టైమ్ ట్రావెల్ కాదు..

( మొదటి పేజీ తరువాయి )

ముగింపు దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఇందులో నెగిటివ్ రోల్‌లో నటిస్తున్న మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తాజాగా మూవీ స్టోరీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. 'వారణాసి సినిమా కేవలం టైమ్ ట్రావెల్ స్టోరీ కాదు. అంతకు మించిన స్థాయిలో ఉంటుంది. డిఫరెంట్ టైమ్ ట్రావెల్స్ మధ్య ఈ స్టోరీ సాగుతోంది' అని పృథ్వీరాజ్ సుకుమారన్ సినిమాపై అంచనాలను మరింత పెంచే విధంగా మాట్లాడారు. అదే విధంగా రాజమౌళి డైరెక్షన్‌లో మహేశ్ బాబు, ప్రియాంక చోప్రాతో కలిసి వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక వారణాసిలో పృథ్వీరాజ్ సుకుమారన్‌కు సంబంధించిన షూటింగ్ పార్ట్ ప్రస్తుతం కంప్లీట్ అయినట్లు సమాచారం. ఇక మిగతా భాగానికి సంబంధించి చిత్రీకరణను సైతం మరో 3 వారాల్లో పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. ఇక ఆ తర్వాత మేకర్స్ గ్లోబల్ స్థాయిలో ప్రమోషన్స్ స్టార్ట్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రమోషన్స్‌కు ఇప్పటికే రాజమౌళి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు టాక్ నడుస్తోంది. పలు విదేశీ భాషల్లో సైతం రిలీజ్ కానున్న చిత్రం కావడంతో ప్రమోషన్స్ కూడా భారీ ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.



## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో
# రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**సీఎం రేవంత్**

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని విఘ్నేశ్వరుడుని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు. వాడవాడలా వెలిసే గణేష్ మండపాలలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తోందని తెలిపారు.





# పవన్ కల్యాణ్‌కు కేరళ సీఎం స్పెషల్ థ్యాంక్స్

**ఆయుర్వేద చికిత్స కోసం కేరళను ఎంచుకున్న డిప్యూటీ సీఎం**

మహా : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆయుర్వేద చికిత్స కోసం పవన్ తమ రాష్ట్రాన్ని ఎంచుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పవన్ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ఇద్దరు కీలక నేతల మధ్య జరిగిన ఈ ఆత్మీయ సంభాషణ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పవన్ కల్యాణ్ తన కేరళ పర్యటన అనుభవాలను పంచుకుంటూ చేసిన పోస్టుకు కేరళ సీఎం సతీశన్ బదులిచ్చారు. "పవన్ కల్యాణ్ గారూ, మీ మంచి మాటలకు, అలాగే విశ్రాంతి, కోలుకోవడానికి కేరళను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు. మా ప్రజల ఆప్యాయత, మా ప్రాచీన దేవాలయాల దర్శనం మీకు శాంతిని, స్వస్థతను చేకూర్చాయని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. త్వరలోనే మిమ్మల్ని మళ్లీ మా రాష్ట్రంలో చూడాలని ఆశిస్తున్నాము. కేరళ ప్రభుత్వం, ప్రజల తరపున మీరు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని సతీశన్ తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, పవన్ కల్యాణ్ తన కేరళ పర్యటన గురించి స్పందిస్తూ ఒక పోస్ట్ చేశారు. చికిత్స నిమిత్తం కేరళలో ఉన్న సమయంలో అక్కడి ప్రజల ఆప్యాయత, దయ, ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. పర్యటనలో భాగంగా త్రిప్రయార్ శ్రీరామ స్వామి, గురువాయూర్ శ్రీకృష్ణ, మామ్మియూర్ శ్రీ మహాదేవ, చెట్టికుళంగర శ్రీ భగవతి అమ్మ వంటి ప్రముఖ దేవాలయాలను సందర్శించుకున్నానని, ఈ దర్శనాలు తనకు భక్తి, శాంతి, ప్రశాంతతను అందించాయని వివరించారు. తన పర్యటనకు సహకరించిన కేరళ సీఎం వీడీ సతీశన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి పవన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ముంబైలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ సర్జరీ చేయించుకున్న పవన్, దాని తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ఆయుర్వేద వైద్యం తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన అక్కడి పలు ఆలయాలను సందర్శిస్తూ, చికిత్స తీసుకుంటూ విశ్రాంతిలో ఉన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎన్డీయే భాగస్వామ్య పక్షానికి చెందిన ఉప ముఖ్యమంత్రి మధ్య ఈ తరహా స్నేహపూర్వక సంభాషణ జరగడం రాజకీయ వర్గాల్లోనూ సానుకూల వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. పవన్ కల్యాణ్ వంటి ప్రముఖులు ఆయుర్వేద చికిత్స కోసం కేరళను ఎంచుకోవడం, ఆ రాష్ట్ర సంప్రదాయ వైద్య విధానానికి ఒక గుర్తింపుగా అక్కడి వారు భావిస్తున్నారు.

# భారత్‌కు రష్యా హైస్పీడ్ రైలు ఆఫర్!

- **గంటకు 360 కి.మీ. వేగం.. 642 మంది ప్రయాణికుల సామర్థ్యం**
- **వందేభారత్ తర్వాత ఇవోల్గా.. 'మేక్ ఇన్ ఇండియా'కు రష్యా సాంకేతిక సహకారం**



**న్యూఢిల్లీ, మహా:** భారతీయ రైల్వేలను అత్యాధునిక సాంకేతికతతో కొత్త దిశలోకి తీసుకెళ్లే ప్రయత్నాలు వేగం పుంజుకుంటున్న వేళ.. రష్యా కీలక ప్రతిపాదనను భారత్ ముందుంచినట్లు తెలుస్తోంది. గంటకు 360 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే 'ఇవోల్గా హైస్పీడ్ రైలు' సాంకేతికతను భారత్‌కు అందించేందుకు రష్యాకు చెందిన ట్రాన్స్‌మాష్ హోల్డింగ్ ప్రతిపాదించినట్లు సమాచారం. ఇన్నోప్రోమ్ ఇండియా కార్యక్రమంలో ఈ ప్రతిపాదనను సమర్పించినట్లు తెలుస్తోంది. సాంకేతిక బదిలీతో పాటు భారతదేశంలోనే అధిక శాతం పరికరాలతో రైళ్లను తయారు చేసే అవకాశాన్ని కల్పించాలన్నది రష్యా ప్రతిపాదనలో కీలక అంశంగా ఉన్నట్లు సమాచారం.

**గంటకు 360 కి.మీ. వేగం**

రష్యా ప్రతిపాదించిన ఇవోల్గా హైస్పీడ్ రైలుకు గంటకు 360 కిలోమీటర్ల గరిష్ఠ వేగ సామర్థ్యం ఉందని సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం తెలుస్తోంది. ఎనిమిది బోగీలతో కూడిన రైలు సుమారు 642 మంది ప్రయాణికులను తీసుకెళ్లగలదు. రైలు జీవితకాలం సుమారు 30 ఏళ్లుగా పేర్కొంటున్నారు.

మరో ముఖ్యమైన అంశం.. ఈ రైలులో సుమారు 80 శాతం పరికరాలను స్థానికంగా తయారు చేసుకునే అవకాశం కల్పించాలన్న రష్యా ప్రతిపాదన. అదే విధంగా సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, స్థానిక ఉత్పత్తికి అవకాశం లభిస్తే.. భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలకు ఇది అనుగుణంగా ఉండే అవకాశం ఉంది.

**వందేభారత్ స్లీపర్‌లో ఇప్పటికే భాగస్వామ్యం**

ట్రాన్స్‌మాష్ హోల్డింగ్‌కు భారత రైల్వే రంగంతో ఇప్పటికే అనుబంధం ఉంది. వందేభారత్ స్లీపర్ రైళ్ల తయారీలో భారత్‌తో కలిసి సంయుక్త భాగస్వామ్యంతో పనిచేస్తోంది. ఈ ప్రాజెక్టులో 120 వందేభారత్ స్లీపర్ రైళ్ల తయారీకి ఒప్పందం కుదిరినట్లు సమాచారం. భారత రైల్వే అవసరాలు, స్థానిక తయారీ సామర్థ్యం, ఇక్కడి పారిశ్రామిక వ్యవస్థపై ఇప్పటికే అనుభవం ఉన్న నేపథ్యంలో.. ఇప్పుడు మరింత వేగవంతమైన రైలు సాంకేతికతను భారత్‌కు అందించేందుకు రష్యా ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

**రైలు వేగమే కాదు.. ట్రాక్ కూడా కీలకం**

అయితే గంటకు 360 కిలోమీటర్ల వేగంతో రైలు నడపడం అంత సులభమైన విషయం కాదు. హైస్పీడ్ రైలుకు అనుగుణంగా ప్రత్యేక రైల్వే ట్రాక్‌లు, అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ, విద్యుదీకరణ, భద్రతా సాంకేతికత, నిర్వహణ సదుపాయాలు అవసరం. సాధారణ రైల్వే మార్గాలపై ఇలాంటి వేగాన్ని సాధించడం సాధ్యం కాదు.

అందువల్ల రష్యా ప్రతిపాదనను భారత్ పరిశీలించే సమయంలో కేవలం రైలు గరిష్ఠ వేగాన్నే కాకుండా.. మొత్తం ప్రాజెక్టు వ్యయం, మౌలిక సదుపాయాల నిర్మాణం, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ ఖర్చులు, విడిభాగాల లభ్యత, సాంకేతిక బదిలీ, స్థానిక తయారీ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుంది.

# మట్టిలో మూర్తి.. పత్రిలో ప్రకృతి.. గణపతిలో జీవన తత్వం.

విఘ్నేశ్వరుడి వైభవం నుంచి ఇరవై ఒక్క పత్రుల ప్రకృతి రహస్యం వరకు..
భక్తి, జ్ఞానం, పర్యావరణ స్పృహను చాటే వినాయక చవితి.

వినాయక చవితి అంటే ఒక పండుగ మాత్రమే కాదు.. భక్తి, జ్ఞానం, ఏకాగ్రత, వినయం, కుటుంబ అనుబంధం, సామాజిక ఐక్యత, ప్రకృతి పరిరక్షణ వంటి అనేక జీవన విలువలను ఏకకాలంలో మనకు గుర్తుచేసే మహత్తర ఆధ్యాత్మిక వేడుక. గజముఖంతో దర్శనమిచ్చే గణనాథుడు భారతీయ సంస్కృతిలో అత్యంత ఆరాధనీయమైన దేవతల్లో ఒకరు. ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా గణపతిని పూజించడం వెనుక విఘ్నాలు తొలగి కార్యం విజయవంతం కావాలనే విశ్వాసమే కాదు.. ప్రతి పనిని జ్ఞానం, ఏకాగ్రత, వినయం, వివేకంతో ప్రారంభించాలనే గొప్ప జీవన తత్వం కూడా దాగి ఉంది.

భాద్రపద శుద్ధ చవితి రోజున గణపతిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఇంటింటా మట్టి వినాయకులు కొలువుదీరుతుంటే.. వీధులు, కాలనీలు, గ్రామాలు, పట్టణాల్లో గణపతి మండపాలు భక్తులతో కళకళలాడుతాయి. గణపతి నామస్మరణ, భజనలు, స్తోత్ర పారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వాతావరణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది. ఒకవైపు మంగళవాయిద్యాల నాదం.. మరోవైపు 'ఓం గం గణపతయే నమః' అనే మంత్రోచ్చారణ.. మధ్యలో భక్తుల హృదయాల్లో నిండే ఆనందం.. ఇవన్నీ కలిసి వినాయక చవితిని భారతీయ ఆధ్యాత్మిక జీవనంలో ఒక ప్రత్యేక అనుభూతిగా నిలబెడతాయి.

**పార్వతీదేవి సృష్టించిన బాలుడే గణనాథుడు**

గణేశుడి జన్మకు సంబంధించి పురాణాల్లో అనేక సంప్రదాయ కథనాలు ఉన్నాయి. వాటిలో అత్యంత ప్రసిద్ధమైన కథనం ప్రకారం.. పార్వతీదేవి స్నానానికి వెళ్లే సమయంలో ద్వారం వద్ద కాపలాగా ఉండేందుకు తన శరీరానికి రాసుకున్న పసుపుతో ఒక బాలుడిని రూపొందించి, అతనికి ప్రాణం పోశారు. తన అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించవద్దని ఆ బాలుడిని ఆదేశించారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన పరమశివుడిని సైతం ఆ బాలుడు అడ్డుకున్నాడు. తల్లి ఆజ్ఞను పాటించడంలో వెనుకడుగు వేయని బాలుడితో శివుడికి ఘర్షణ ఏర్పడింది. చివరకు శివుడు బాలుడి శిరస్సును వేరు చేశారని పురాణ కథనం చెబుతుంది.తన కుమారుడి పరిస్థితిని చూసిన పార్వతీదేవి తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఆమెను శాంతింపజేసేందుకు శివుడు తన గణాలను పంపి ఉత్తర దిశలో మొదట కనిపించిన జీవి తలను తీసుకురావాలని ఆదేశించారని కథనం. వారు ఏనుగు తలను తీసుకురావడంతో దానిని బాలుడి శరీరానికి అమర్చి శివుడు తిరిగి ప్రాణం పోశారు.ఆ బాలుడే గణపతిగా అవతరించాడని పురాణ విశ్వాసం. అనంతరం దేవతలు గణపతికి అనేక వరాలు ప్రసాదించారని.. ఏ కార్యాన్ని ప్రారంభించినా ముందుగా ఆయనను పూజించాలని వరం లభించిందని పురాణాలు చెబుతాయి. అందుకే ఆయన ఆదిపూజ్యుడు.. విఘ్నేశ్వరుడు.. గణాధ్యక్షుడు.. గజాననుడు.. లంబోదరుడు వంటి అనేక నామాలతో భక్తుల హృదయాల్లో కొలువుదీరారు.



**గణపతి రూపంలోనే గొప్ప జీవన తత్వం**

గణపతి విగ్రహాన్ని కేవలం దేవతా స్వరూపంగా కాకుండా తాత్విక దృష్టితో పరిశీలిస్తే.. ఆయన ప్రతి అవయవం ఒక జీవన సందేశాన్ని అందిస్తుందని ఆధ్యాత్మిక సంప్రదాయాలు చెబుతున్నాయి. ఏనుగు తల విశాలమైన జ్ఞానానికి ప్రతీకగా భావిస్తారు. పెద్ద చెవులు శ్రద్ధగా వినే ఓర్పును సూచిస్తాయి. చిన్న కళ్లు ఏకాగ్రతను ప్రతిబింబిస్తాయి. తొండం పరిస్థితులకు అనుగుణంగా సున్నితమైనదానినీ, బలమైనదానినీ సమర్థంగా నిర్వహించగల సామర్థ్యానికి ప్రతీకగా వ్యాఖ్యానిస్తారు.

పెద్ద పొట్ట విషయాలను సహనంతో స్వీకరించే గుణాన్ని సూచిస్తుందని భావిస్తారు. గణపతి వాహనమైన ఎలుకను కోరికలకు ప్రతీకగా పేర్కొంటారు. ఎంతటి కోరికలు ఉన్నా వాటిపై నియంత్రణ సాధించాలనే సందేశం అందులో దాగి ఉందని ఆధ్యాత్మిక భావన.అందుకే గణపతి రూపం ఒక గొప్ప జీవన గ్రంథంలాంటిది. జ్ఞానంతో ఆలోచించాలి.. శ్రద్ధగా వినాలి.. వినయంగా జీవించాలి.. కోరికలను అదుపులో ఉంచుకోవాలి.. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి. గణపతి స్వరూపం మనిషికి చెప్పే అంతరార్థం ఇదే.

**పూజలో ప్రతి అంశానికీ ప్రత్యేకత**

వినాయక చవితి రోజున ఇంటిని శుభ్రం చేసి పూజా స్థలాన్ని సిద్ధం చేస్తారు. గణపతి ప్రతిమను ప్రతిష్ఠించి పసుపు, కుంకుమ, అక్షతలు, పుష్పాలు సమర్పిస్తారు. కుటుంబ సంప్రదాయాన్ని అనుసరించి షోడశోపచార పూజ నిర్వహిస్తారు.

సంకల్పం, ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, స్నానం, వస్త్రం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, హారతి వంటి ఉపచారాలను సమర్పించడం ఆనవాయితీ. 'ఓం గం గణపతయే నమః' మంత్రాన్ని జపిస్తూ గణపతి అథర్వశీర్షం, గణేశ స్తోత్రాలు, సంకటనాశన గణేశ స్తోత్రం తదితరాలను పారాయణం చేస్తారు.

పూజలో ప్రతి ఉపచారం ఒక ఆహ్వానం మాత్రమే కాదు.. భక్తుడు తన మనస్సును దైవంపై నిలిపే ఒక ఆధ్యాత్మిక సాధన. ధూపంలో పరిమళం.. దీపంలో వెలుగు.. పుష్పంలో పవిత్రత.. నైవేద్యంలో కృతజ్ఞత.. నమస్కారంలో వినయం.. ఇలా పూజా విధానం మొత్తం మనిషి అంతరంగాన్ని శుద్ధి చేసే ఒక సాంస్కృతిక ప్రక్రియగా నిలుస్తుంది.

**ఇరవై ఒక్క పత్రులు.. భక్తిలో పవిత్రత.. ప్రకృతిలో వైవిధ్యం**

వినాయక పూజలో ఇరవై ఒక్క రకాల పత్రాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రాంతం, కుటుంబ సంప్రదాయం, పూజా విధానాన్ని బట్టి పత్రాల జాబితాలో కొంత భేదం కనిపించవచ్చు. వివిధ సంప్రదాయాల్లో దూర్వ, బిల్వం, వేప, తులసి, మామిడి, జమ్మి తదితర ఆకులను గణపతికి సమర్పిస్తారు.

ఈ పత్రి సంప్రదాయాన్ని కేవలం ఒక ఆచారంగా మాత్రమే చూడాల్సిన అవసరం లేదు. మన చుట్టూ ఉన్న మొక్కలు, చెట్లు, వృక్షజాలం పట్ల గౌరవాన్ని పెంపొందించే సాంస్కృతిక సందర్భంగానూ చూడవచ్చు. ఒకే పూజా తట్టలో భిన్నమైన ఆకులు చేరినట్లే.. ప్రకృతిలో భిన్నమైన జీవజాతులు కలిసి జీవ వ్యవస్థను నిర్మిస్తాయి.

**పత్రి వెనుక శాస్త్రీయ కోణం**

ఆధునిక వృక్షశాస్త్రం, ఫైటోకెమిస్ట్రీ పరిశోధనల్లో అనేక ఔషధ మొక్కల ఆకుల్లో flavonoids, phenolic compounds, essential oils తదితర జీవక్రియాశీల పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. వేప, తులసి, బిల్వం, దూర్వ వంటి మొక్కలపై యాంటీ ఆక్సిడెంట్ లేదా యాంటీమైక్రోబయల్ లక్షణాలకు సంబంధించి పరిశోధనలు జరిగాయి.

అయితే ఇక్కడ శాస్త్రీయంగా ఒక ముఖ్యమైన జాగ్రత్త అవసరం. ఒక మొక్కలో బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉన్నాయనే విషయం వేరు.. గణపతి పూజలో ఆ ఆకును సమర్పించడం వల్ల అదే ఆరోగ్య ప్రయోజనాలు మనిషికి నేరుగా లభిస్తాయని చెప్పడం వేరు. రెండో వాదనకు తగిన క్లినికల్ ఆధారాలు లేవు.అందువల్ల పత్రి యొక్క శాస్త్రీయ ప్రాధాన్యాన్ని అతిశయోక్తి లేకుండా చూడాలి. పత్రి పూజ మనకు మొక్కల విలువను, స్థానిక వృక్షజాలాన్ని, ప్రకృతి పరిరక్షణ అవసరాన్ని గుర్తుచేసే అద్భుతమైన సాంస్కృతిక సందర్భం.

మారేడు పత్రం.. సంప్రదాయ వైభవం

మారేడు లేదా బిల్వ పత్రం వినాయక పూజలో ఎంతో పవిత్రంగా భావిస్తారు. మారేడు ఆకుల్లో సహజ వర్ణసమ్మేళనాలు, సువాసన పదార్థాలు, ఇతర మొక్కల రసాయనాలు ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. వీటిలోని కొన్ని పదార్థాలపై కణాలను ఆక్సీకరణ నష్టం నుంచి రక్షించే లక్షణాలకు సంబంధించి ప్రయోగశాల స్థాయిలో అధ్యయనాలు జరిగాయి. భారతీయ సంప్రదాయ వైద్య విధానాల్లోనూ మారేడుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

దూర్వ.. గణపతికి అత్యంత ప్రీతిపాత్రమైన పత్రి

దూర్వ లేదా గరిక గణపతికి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా సంప్రదాయంలో భావిస్తారు. నేలపై వేగంగా విస్తరించే ఈ గడ్డి జాతి మొక్కలో సహజ వర్ణసమ్మేళనాలు, సువాసన పదార్థాలు, ఇతర మొక్కల రసాయనాలు ఉన్నట్లు కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. కణాలను ఆక్సీకరణ నష్టం నుంచి కాపాడే లక్షణాలపై కూడా ప్రాథమిక పరిశోధనలు ఉన్నాయి.వేప.. ప్రకృతి ప్రసాదించిన రక్షణ కవచం

వేప భారతీయ జీవన విధానంలో శతాబ్దాలుగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న వృక్షం. వేప ఆకుల్లో అనేక సహజ రసాయన పదార్థాలు ఉంటాయి. ముఖ్యంగా పురుగులను నియంత్రించే లక్షణాలకు సంబంధించిన పరిశోధనలు విస్తృతంగా ఉన్నాయి. కొన్ని పదార్థాలకు సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించే లక్షణాలు ఉన్నట్లు ప్రయోగశాల అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**తులసి.. సుగంధంతో పాటు సహజ రసాయన సంపద**

తులసి భారతీయ కుటుంబాల్లో ఆధ్యాత్మికంగా అత్యంత పవిత్రమైన మొక్కగా భావిస్తారు. తులసి ఆకులు, వాటి నుంచి లభించే సుగంధ తైలాల్లో సహజ సుగంధ పదార్థాలు ఉంటాయి. వీటిలో కొన్ని పదార్థాల యాంటీఆక్సిడెంట్, సూక్ష్మజీవి నిరోధక లక్షణాలపై పరిశోధనలు జరిగాయి. అయితే పూజలో తులసిని సమర్పించడం వల్ల నిర్దిష్ట వ్యాధులు నయమవుతాయని చెప్పడానికి శాస్త్రీయ ఆధారాలు లేవు.

**జిల్లేడు.. పూజలో పవిత్రం.. వినియోగంలో జాగ్రత్త**

జిల్లేడు లేదా అర్క పత్రిని కొన్ని సంప్రదాయాల్లో వినాయక పూజలో ఉపయోగిస్తారు. ఈ మొక్కలో సహజ క్రియాశీల పదార్థాలు ఉంటాయి. అయితే వీటిలో విషపూరిత ప్రభావం కలిగించే పదార్థాలు కూడా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా జిల్లేడు పాలరసం శరీరానికి హాని కలిగించవచ్చు. అందువల్ల పూజలో ఉపయోగించే జిల్లేడు ఆకులను ఆహారంగా తీసుకోవడం లేదా స్వయంగా ఔషధంగా ఉపయోగించడం చేయకూడదు.

**మామిడి ఆకులు.. శుభానికి ప్రతీక**

మామిడి చెట్టు భారతీయ సంస్కృతిలో శుభానికి ప్రతీకగా నిలుస్తుంది. మామిడి ఆకుల్లో సహజ వర్ణసమ్మేళనాలు, మొక్కల రక్షణకు ఉపయోగపడే పదార్థాలు, ఇతర సహజ రసాయనాలు ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. వీటిలోని కొన్ని పదార్థాల కణ రక్షణ లక్షణాలపై అధ్యయనాలు ఉన్నాయి.జమ్మి పత్రం.. ఎండలను తట్టుకునే వృక్ష సంపద

జమ్మి లేదా శమీ వృక్షం భారతీయ సంప్రదాయంలో పవిత్రమైనదిగా భావిస్తారు. 'శమీ' అనే పేరు ప్రాంతాన్ని బట్టి వేర్వేరు వృక్షజాతులను సూచించే అవకాశం ఉంది. కొన్ని శమీ జాతుల ఆకుల్లో సహజ వర్ణసమ్మేళనాలు, ఇతర మొక్కల రసాయనాలు ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎండను, పొడి వాతావరణాన్ని తట్టుకుని పెరిగే వృక్షాలను సంరక్షించాల్సిన అవసరాన్ని కూడా ఈ పత్రి గుర్తుచేస్తుంది.

**దానిమ్మ పత్రం.. పరిశోధనలకు ఆసక్తికరమైన మొక్క**

దానిమ్మ మొక్కలో అనేక సహజ రసాయన పదార్థాలు ఉన్నాయి. ముఖ్యంగా దానిమ్మ పండు, తొక్కలోని పదార్థాలపై విస్తృతంగా పరిశోధనలు జరిగాయి. ఆకుల్లోనూ కొన్ని సహజ సమ్మేళనాలు ఉన్నప్పటికీ.. పండు, తొక్కతో పోలిస్తే ఆకులపై శాస్త్రీయ ఆధారాలు తక్కువగా ఉన్నాయి. అందువల్ల ఆకులకు నిర్దిష్ట వైద్య ప్రయోజనాలను ఆపాదించడం శాస్త్రీయంగా సముచితం కాదు.

**అరటి పత్రం.. మనిషి జీవనంతో విడదీయలేని మొక్క**

అరటి మొక్క భారతీయ జీవన విధానంలో ఆహారం నుంచి ఆచారాల వరకు అనేక సందర్భాల్లో ఉపయోగపడుతుంది. అరటి ఆకుల్లోనూ సహజ మొక్కల పదార్థాలు ఉంటాయి. అయితే పూజలో అరటి ఆకును సమర్పించడం వల్ల ప్రత్యేకమైన వైద్య ప్రయోజనం కలుగుతుందని నిర్ధారించే మానవ పరిశోధనలు లేవు.

**జాజి.. మరువం.. దవనం.. సువాసనలో ప్రకృతి శక్తి**

జాజి, మరువం, దవనం వంటి సుగంధ మొక్కల్లో సహజ సువాసన పదార్థాలు, తైలాలు ఉంటాయి. వీటి పరిమళానికి కారణమయ్యే పదార్థాలపై, అలాగే కొన్ని సహజ జీవక్రియలపై పరిశోధనలు ఉన్నాయి. అయితే కేవలం సువాసనను ఆస్వాదించడం వల్ల నిర్దిష్ట ఆరోగ్య సమస్యలు నయమవుతాయని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు.

**విష్ణుక్రాంత.. సంప్రదాయంలో ప్రాధాన్యం**

విష్ణుక్రాంతగా పిలిచే మొక్కను కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక పూజా సంప్రదాయాల్లో ఉపయోగిస్తారు. ఈ మొక్కలో సహజ రసాయన పదార్థాలు ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. సంప్రదాయ వైద్య విధానాల్లో దీనికి ప్రస్తావన ఉన్నప్పటికీ.. మానవుల్లో నిర్దిష్ట వ్యాధులకు చికిత్సగా ఉపయోగించడంపై ఆధారాలు పరిమితంగానే ఉన్నాయి.

**ఉత్తరేణి.. సహజ రసాయన సంపద**

ఉత్తరేణి లేదా అపామార్గంలో వివిధ సహజ రసాయన పదార్థాలు ఉన్నట్లు వృక్షశాస్త్ర పరిశోధనలు సూచిస్తున్నాయి. కొన్ని పదార్థాలకు ప్రయోగశాల స్థాయిలో సూక్ష్మజీవి నిరోధక, కణ రక్షణ లక్షణాలు కనిపించినట్లు అధ్యయనాలు ఉన్నాయి. అయినప్పటికీ దీనిని స్వయంగా ఔషధంగా ఉపయోగించడం తగదు.

**రావి.. మర్రి.. జీవవైవిధ్యానికి ప్రతీకలు**

రావిచెట్టు, మర్రిచెట్టు భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాచీనమైన వృక్షాలు. వీటి ఆకులు, బెరడు, ఇతర భాగాల్లో సహజ రసాయన పదార్థాలపై పరిశోధనలు జరిగాయి. అంతకుమించి.. ఈ మహావృక్షాలు పక్షులు, చిన్న జీవులు, అనేక రకాల కీటకాలకు ఆవాసాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల వీటి సంరక్షణ జీవవైవిధ్య పరిరక్షణలో అత్యంత ముఖ్యమైనది.

అర్జున వృక్షం.. సంప్రదాయ వైద్యంలో ప్రస్తావన

అర్జున వృక్షాన్ని భారతీయ సంప్రదాయ వైద్య విధానాల్లో చాలాకాలంగా ప్రస్తావిస్తున్నారు. ముఖ్యంగా దాని బెరడుపై పరిశోధనలు ఎక్కువగా జరిగాయి. ఆకుల్లోనూ సహజ రసాయన పదార్థాలు ఉన్నప్పటికీ.. బెరడుపై జరిగిన పరిశోధనల ఫలితాలను ఆకులకు నేరుగా వర్తింపజేయడం శాస్త్రీయంగా సరికాదు.

**గన్నేరు.. అందమైన పువ్వు.. ప్రమాదకరమైన విషపదార్థాలు**

గన్నేరు మొక్క ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ.. దాని ఆకులు, ఇతర భాగాల్లో తీవ్రమైన విషపూరిత పదార్థాలు ఉంటాయి. ముఖ్యంగా గుండె పనితీరును ప్రభావితం చేసే విషపదార్థాలు ఇందులో ఉండవచ్చు. కాబట్టి గన్నేరు ఆకులను ఎట్టి పరిస్థితుల్లోనూ తినకూడదు. పూజలో ఉపయోగించడం సంప్రదాయపరమైన అంశం మాత్రమే; దానిని ఔషధంగా ఉపయోగించడం ప్రమాదకరం.

కదంబం.. ప్రకృతి వైవిధ్యానికి గుర్తు

కదంబ వృక్షం భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని పొందింది. దీని వివిధ భాగాల్లో సహజ వర్ణసమ్మేళనాలు, ఇతర మొక్కల రసాయన పదార్థాలపై పరిశోధనలు జరిగాయి. కొన్ని ప్రయోగశాల అధ్యయనాల్లో కణ రక్షణ, సూక్ష్మజీవి నిరోధక లక్షణాలకు సంబంధించిన ఫలితాలు కనిపించాయి. అయితే మానవుల్లో నిర్దిష్ట వైద్య ప్రయోజనాలను నిర్ధారించేందుకు మరింత పరిశోధన అవసరం.

**ఉండ్రాళ్లు.. మోదకాలు.. నైవేద్యంలోనూ సంప్రదాయ వైభవం**

గణపతికి ఉండ్రాళ్లు, కుడుములు, మోదకాలు, పాయసం, పండ్లు తదితరాలను నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ. ముఖ్యంగా మోదకం గణపతికి ప్రీతిపాత్రమైన నైవేద్యంగా ప్రసిద్ధి చెందింది.

ప్రాంతీయ ఆహార సంస్కృతిని ప్రతిబింబించే ఉండ్రాళ్లు, కుడుములు వంటి సంప్రదాయ వంటకాలు పండుగలో కుటుంబ సభ్యులను ఒకచోట చేర్చడమే కాకుండా.. తరతరాలుగా వస్తున్న వంటకాల వారసత్వాన్ని కూడా కొనసాగిస్తాయి. ఒక తరం చేతి నుంచి మరో తరానికి వంటకం మారుతున్నట్టే.. ఒక తరం నుంచి మరో తరానికి సంస్కృతి కూడా ప్రయాణిస్తుంది.

**చంద్రుడి కథ.. అహంకారానికి హెచ్చరిక**

గణేశుడికి సంబంధించిన మరో ప్రసిద్ధ పురాణగాథ చంద్రుడితో ముడిపడి ఉంది. గణపతి తన వాహనమైన ఎలుకపై ప్రయాణిస్తున్న సందర్భాన్ని చూసి చంద్రుడు పరిహసించాడని, దాంతో గణపతి చంద్రుడిని శపించాడని పురాణ కథనం. అనంతరం చంద్రుడు తన తప్పును తెలుసుకుని గణపతిని ప్రార్థించడంతో శాపానికి ఉపశమనం కలిగిందని చెబుతారు.ఈ కథ ఆధారంగానే వినాయక చవితి రోజున చంద్ర దర్శనం చేయకూడదనే విశ్వాసం కొన్ని సంప్రదాయాల్లో ఉంది. అయితే ఈ పురాణ గాథకు సంబంధించిన వివరాల్లో సంప్రదాయాలవారీగా భిన్నమైన రూపాలు కనిపిస్తాయి.

తాత్వికంగా చూస్తే ఈ కథలో గొప్ప హెచ్చరిక కనిపిస్తుంది. రూపం, స్థాయి, పరిస్థితులను చూసి ఎవరినీ అవహేళన చేయకూడదు. అహంకారం ఎంతటి వ్యక్తినైనా తప్పుదోవ పట్టించగలదనే సందేశం ఇందులో దాగి ఉంది.

**గణపతి ఉత్సవాలు.. భక్తి నుంచి సామాజిక చైతన్యం వరకు**

వినాయక చవితి కాలక్రమంలో ఇంటి పూజను దాటి సామూహిక ఉత్సవంగా విస్తరించింది. ముఖ్యంగా బాల గంగాధర్ తిలక్ ఆధ్వర్యంలో 19వ శతాబ్దం చివర్లో మహారాష్ట్రలో సామూహిక గణపతి ఉత్సవాలు ప్రజలను ఒకచోట చేర్చే వేదికగా అభివృద్ధి చెందాయి. అనంతరం దేశంలోని అనేక ప్రాంతాలకు ఈ సామూహిక ఉత్సవాల సంస్కృతి విస్తరించింది.

నేడు గణేష్ మండపాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కావు. సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా మారుతున్నాయి. అన్నదానం, రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల ద్వారా పండుగ సామాజిక బాధ్యతకు వేదికగా నిలుస్తోంది.

**మట్టి గణపతి.. భక్తితో పాటు పర్యావరణ సందేశం**

నేటి కాలంలో వినాయక చవితి అందించే అత్యంత కీలకమైన సందేశాల్లో పర్యావరణ పరిరక్షణ ఒకటి. సహజ మట్టితో తయారుచేసిన గణపతి ప్రతిమలను ప్రోత్సహించడం, హానికరమైన రంగుల వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ అలంకరణలను నియంత్రించడం, నిమజ్జనానికి నిర్దేశించిన ప్రాంతాలను వినియోగించడం ద్వారా పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించవచ్చు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమలు సహజ మట్టి ప్రతిమల మాదిరిగా నీటిలో సులభంగా విచ్ఛిన్నం కావు. కొన్ని పెయింట్లలో ఉండే రసాయనాలు, ఇతర అలంకరణ పదార్థాలు జల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల 'మట్టి గణపతి.. స్వచ్ఛమైన పర్యావరణం' అనే సందేశం భక్తి నుంచి ఆచరణలోకి రావాల్సిన అవసరం ఉంది.

**నిమజ్జనం.. అనిత్యతను చెప్పే ఆచారం**

మట్టితో రూపొందిన గణపతిని భక్తితో ప్రతిష్ఠించి.. కొద్ది రోజులు పూజించి.. చివరికి నీటిలో నిమజ్జనం చేయడం భారతీయ తత్వంలో అనిత్యతకు ప్రతీకగా చూడవచ్చు. ప్రకృతి నుంచి వచ్చినది తిరిగి ప్రకృతిలో కలిసిపోతుందనే భావన ఇందులో ప్రతిఫలిస్తుంది.

అయితే ఆధునిక కాలంలో నిమజ్జనం కూడా పర్యావరణహితంగా ఉండాలి. సహజ మట్టి ప్రతిమలు, సహజ రంగులు, పర్యావరణహిత అలంకరణలు, కృత్రిమ నిమజ్జన కుంటలు వంటి పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా భక్తి, సంప్రదాయం, పర్యావరణ బాధ్యతలను సమన్వయం చేయవచ్చు.

**పత్రి సంప్రదాయంలో దాగిన అసలు శాస్త్రీయ సందేశం**

వినాయకుడికి సమర్పించే పత్రుల్లో కనిపించే సహజ రసాయన పదార్థాలు మొక్కల జీవనంలో కీలక పాత్ర పోషిస్తాయి. పురుగులు, సూక్ష్మజీవులు, వాతావరణ మార్పులు, ఇతర పర్యావరణ ఒత్తిళ్ల నుంచి మొక్కలను రక్షించడంలో ఇటువంటి సహజ పదార్థాలు సహాయపడతాయి. కొన్ని పదార్థాలకు ప్రయోగశాలలో కణ రక్షణ లేదా సూక్ష్మజీవి నిరోధక లక్షణాలు కనిపించడం శాస్త్రీయంగా ఆసక్తికరమైన అంశం.

కానీ 'పత్రిని గణపతికి సమర్పిస్తే ఆ పత్రి ఔషధ గుణాలు మనిషికి లభిస్తాయి' అని చెప్పడం శాస్త్రీయంగా నిర్ధారించబడిన విషయం కాదు. అలాగే 'ఇరవై ఒక్క పత్రులు ఇరవై ఒక్క వ్యాధులను నయం చేస్తాయి' అనే ప్రచారానికీ తగిన వైద్య ఆధారాలు లేవు.

అయితే ఈ సంప్రదాయం మనకు అందించే అసలైన సందేశం మరింత విశాలమైనది. మనిషి ప్రకృతికి వేరైనవాడు కాదు.. ప్రకృతిలో ఒక భాగం. చెట్లు, మొక్కలు, ఆకులు, పుష్పాలు, గడ్డి, వృక్షజాలం అన్నీ జీవవ్యవస్థలో అంతర్భాగాలు. పత్రి పూజ ద్వారా తరతరాలకు ఈ ప్రకృతి అనుబంధాన్ని గుర్తుచేసే అవకాశం ఏర్పడింది.

**ప్రతి పత్రిలో ఒక కథ.. ప్రతి చెట్టులో ఒక జీవితం**

గణపతికి సమర్పించే ప్రతి పత్రి వెనుక ఒక పురాణ విశ్వాసం ఉంది. ప్రతి మొక్క వెనుక ఒక ప్రకృతి రహస్యం ఉంది. ప్రతి చెట్టు వెనుక ఒక జీవనాధారం ఉంది.

మారేడు మనకు సంప్రదాయ పవిత్రతను గుర్తుచేస్తే.. దూర్వ ప్రకృతి సరళతను చెబుతుంది. వేప ప్రకృతి రక్షణ శక్తిని చాటితే.. తులసి ఆధ్యాత్మిక పవిత్రతను ప్రతిబింబిస్తుంది. జమ్మి ఎండను తట్టుకునే జీవన సామర్థ్యాన్ని గుర్తుచేస్తే.. రావి, మర్రి జీవవైవిధ్యానికి అండగా నిలిచే మహావృక్షాల విలువను చెబుతాయి. గన్నేరు ప్రకృతిని అర్థం చేసుకుని జాగ్రత్తగా ఉపయోగించాల్సిన అవసరాన్ని హెచ్చరిస్తే.. కదంబం వృక్ష వైవిధ్యాన్ని గుర్తుచేస్తుంది.

అందుకే ఇరవై ఒక్క పత్రులు ఒక పూజా సామగ్రి జాబితా మాత్రమే కావు. అవి భారతీయ సంస్కృతి ప్రకృతిని ఎలా చూసిందో చెప్పే ఒక సజీవ సాంస్కృతిక పాఠం.

**భక్తి నుంచి బాధ్యత వైపు.. ఇదే గణనాథుడి సందేశం**

వినాయక చవితి మనకు కేవలం కోరికలు కోరుకునే పండుగ కాదు. విఘ్నాలను ఎదుర్కొనే ధైర్యం.. సమస్యలను పరిష్కరించే వివేకం.. ఇతరుల మాట వినే ఓర్పు.. కోరికలపై నియంత్రణ.. సమాజంతో కలిసి జీవించే స్ఫూర్తి.. ప్రకృతిని గౌరవించే బాధ్యతను గుర్తుచేసే పండుగ.w

ఇంట్లోని చిన్న మట్టి గణపతి నుంచి వేలాది మంది భక్తులతో జరిగే సామూహిక ఉత్సవాల వరకు.. ప్రతి చోటా ఒకే సందేశం ప్రతిధ్వనించాలి.

**భక్తి ఉండాలి.. కానీ బాధ్యతతో.**
**ఉత్సాహం ఉండాలి.. కానీ క్రమశిక్షణతో.**
**వేడుక ఉండాలి.. కానీ పర్యావరణ పరిరక్షణతో.**
**పూజ ఉండాలి.. కానీ ప్రకృతిపై ప్రేమతో.**

మట్టిలో పుట్టిన గణపతి.. మనసులో నిలిచే జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. పత్రిలో ప్రకృతిని చూపిస్తాడు. మోదకంలో ఆనందాన్ని గుర్తుచేస్తాడు. ఎలుకపై అధిరోహించి కోరికలపై నియంత్రణ నేర్పిస్తాడు. పెద్ద చెవులతో వినమని.. చిన్న కళ్లతో ఏకాగ్రతగా చూడమని.. పెద్ద పొట్టతో సహనంగా స్వీకరించమని.. ఏనుగు తలతో విశాలంగా ఆలోచించమని మౌనంగా బోధిస్తాడు.

వినాయక చవితి సారాంశం ఇదే.. విగ్రహాన్ని ఇంటికి తీసుకురావడం కంటే.. గణపతి తత్వాన్ని మనసులోకి తీసుకురావడం గొప్పది. పత్రిని పూజించడం కంటే.. ప్రకృతిని కాపాడటం గొప్పది. నిమజ్జనం చేయడం కంటే.. మనలోని అహంకారం, అసూయ, దురాశలను నిమజ్జనం చేయడం గొప్పది.

జ్ఞానానికి ఆదిపూజ్యుడు.. విజయానికి మార్గదర్శి.. విఘ్నాలను తొలగించే గణనాథుడికి భక్తిపూర్వక నమస్సుమాంజలి.

గణపతి బప్పా మోరియా..
మంగళమూర్తి మోరియా!
భక్తిలో పత్రి పవిత్రం..
ప్రకృతిలో పత్రి జీవం..
శాస్త్రంలో పత్రి పరిశోధనకు అంశం..
పర్యావరణంలో పత్రి భవిష్యత్తుకు బాట.

గడల నరసింహారావు,
అసోసియేట్ ఎడిటర్, మహాపత్రిక.

ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 14-09-2026
సాహిత్యం నిర్వహణ హనీఫ్ 04

# నిర్దిష్ట పదబంధాలు

మెడలో (లేదా మెడ చుట్టు) వేసుకునేదాన్ని మాల అంటాం. హారం కూడా అటువంటి పదమే. కానీ పూలతో, రుద్రాక్షలతో, తులసి ఆకులతో చేసినదాన్ని మాల అంటాం. ముత్యాలు, వజ్రాలతో తయారు చేసినదానికేమో హారం అనే మాటను వాడుతాం. వజ్రాల మాల అనం. ఇలాంటివి సిద్ధాన్నం లాంటివి, లేదా సిద్ధ సమాసాల వంటివి. ఈ రెండవ మాటను readymade compound word అనే స్థూలమైన అర్థంలో మాత్రమే వాడుతున్నాను - రెండూ సంస్కృత పదాలే ఉన్న సమాసం అనే కచ్చితమైన అర్థంలో కాదు. చాలా సందర్భాలలో వీటిలోని పూర్వ పదం ఉత్తర పదాన్ని నిర్దేశిస్తుంది. అందుకే అవి దాదాపు స్థిరమైన పదబంధాలుగా మారిపోయాయి. ఒకే పదం (single word) కు సంబంధించిన సరైన పద స్వరూపం కోసం ఎలా శ్రద్ధ పెట్టి వెతుకుతామో, పదబంధాలకు సంబంధించిన సరైన పదస్వరూపాల కోసం కూడా అలానే శ్రద్ధ పెట్టి వెతకాలి. అయితే కొన్ని సరిహద్దు రేఖ మీద ఉంటాయి. ఉదాహరణకు, పూలహారం ఎందుకు తప్పు అవుతుంది అని వాదిస్తే మనం గట్టిగా జవాబు చెప్పలేం. ఆ పదబంధం కూడా కొంతవరకు సబబే అనిపిస్తుంది.

పిచ్చుకల సమూహాన్ని గుంపు అనీ, పశువుల సమూహాన్ని మంద అనీ అనాలి. పిచ్చుకల మంద అని రాస్తే అర్థంలో భేదం రాకపోవచ్చు గాని, పొసగని పదాన్ని వాడినవాళ్లమౌతాం. అదే విధంగా విమర్శ పరిభాషలో content of a poem కు వస్తువు, plot of a story కి ఇతివృత్తం సరైన మాటలు. కాబట్టి కవితా వస్తువు, కథా ఇతివృత్తం వ్యవహారంలో కుదురుకున్న పదబంధాలు. పందులను ఉంచే స్థలానికి దొడ్డి, పశువులను ఉంచే చోటుకు కొట్టం వాడుకలో స్థిరపడిపోయాయి. అందుకే పందుల కొట్టం, పశువుల దొడ్డి పొసగని పదబంధాలు అవుతాయి. విపరీతమైన చప్పుడు అనే అర్థంలో వాడే మాట సందర్భాన్ని బట్టి మారుతుంది. ఆ చప్పుడును పిల్లలు చేస్తే గోల అనీ, యంత్రాలు చేస్తే రొద అనీ, జలపాతం చేస్తే హోరు అనీ అనవలసి వస్తుంది. పొడవుగా ఉన్న ముఖాన్ని కోలముఖం, పొడవైన ముక్కును కోసుముక్కు అనకుండా వాటిని కోసుముఖం, కోలముక్కు అని రాయలేం. అదే విధంగా పేరు మోసిన, ప్రసిద్ధి చెందిన అన్నవి స్థిరమైన పదబంధాలు. పేరు చెందిన, ప్రసిద్ధి మోసిన అని రాస్తే అపసవ్యత చోటు చేసుకుంటుంది. అలాగే తాగుబోతు - వ్యసనపరుడు; కుట్రదారు - దగాకోరు; సొగసుకత్తె - సౌందర్యవతి స్థిరపడిపోయాయి. ఇటువంటి ఎన్నో ఉదాహరణలు ఇవ్వవచ్చు. నిజానికి ఇవన్నీ చాలా ప్రాథమికమైన విషయాలు. అయినా కొత్తగా రచనారంగం లోకి వచ్చేవాళ్లకు ఉపయోగకరంగా ఉంటాయని ఇలా తెలియజెప్పడం.



– ఎలనాగ
9866945424

# భిన్నత్వమే ప్రగతిశీలం

గొంగళి పురుగునూ
అసహ్యించుకుంటే
సీతాకోకచిలుక అందం
మనకెప్పుడు కనువిందు చేయదు!

వెయ్యి పూల వికాసాన్ని
కాలదన్నుకున్నామంటే
మానవీయ నాగరికతకు
మచ్చగా మిగిలిపోతాము!

ఒకే రంగు పూలు
ఏ తోటా కలగనదు
ఆరామం వైభోగం
వివిధ రంగు పూల గుభాలింపుతోనే!

అన్నిచోట్ల
ఏక సూత్రత పనికిరాదు
వైవిధ్యం లేని చోట
జీవితమే యాంత్రికం!

భిన్నత్వ సంఘర్షణల నుంచే
కొత్త కొత్త ఆవిష్కరణలు
మానవాళి వంతెన కింది ప్రవాహమైతే
నాగరికత ఎప్పటికీ పాత రాతియుగమే!

ఒక కరచాలనం
ఒక కౌగిలింత
ఒకింత చిరునవ్వు పలకరింత
అనుమానాలన్నిటినీ ఆవిరి చేసేవే!!



కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad.
Telangana- 500034.

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

# వెంటాడే కలాలు నుండి బహుజనగణమన దాకా

సెప్టెంబర్ 206, 2001 తెలుగు కవిత్వ చరిత్రలో మరచిపోలేని రోజు. ఆ రోజు వెంటాడే కాలాలువెనుక బడిన కులాలు అనే కవిత్వ సంపుటి వెలువడింది.అంటే వెంటాడే కలాలు కవిత్వ సంపుటికి ఇది రజతోత్సవ సంవత్సరం.తెలుగులో వచ్చిన వైతాళికులు,మహాసంకల్పం,యువనుండి యువ దాకా, గోలకొండ కవుల సంచిక లాగా ఈ కవిత్వ సంపుటికి కూడా ఒక ప్రత్యేకత వుంది.దాని ప్రాసంగికత ఇంకా వుంది. 1990 ల ప్రాంతం లో దేశీయ మార్క్సిజాన్ని తాత్వికభూమిక గా తీసుకుని,దళిత బహుజన అస్తిత్వ ప్రతీకగా తెలుగులో దళిత కవిత్వం మొదలు అయింది. త్రిపురనేని శ్రీనివాస్,గుంటూరు లక్ష్మీ నరసయ్య సంపాదకత్వం లో వచ్చిన చిక్కనవుతున్న పాట ప్రచురణ తో దళిత కవిత్వం ఒక ఊపును అందుకున్నది. దళిత కవిత్వ టేకాఫ్ అద్భుతంగా వున్నా దాని ప్రయాణం మాత్రం అంత గమనింపదగినది గా లేదు. దశాబ్ద కాలంపాటు "ఎవరు దళితులు?" అన్న ప్రశ్న దగ్గరే కొట్టు మిట్టాడింది. యెస్ సి,యెస్ టి,బి.సి,మైనారిటీలను కలగలుపుకుని కొత్త కవిత్వ zప్రపంచానికి తలుపులు తీయవలసిన దళిత కవిత్వం,యెస్ సి కులాల ఆధిపత్య భావజాలం తో లక్ష్యానికి దూరంగా జరగడం మొదలు పెట్టింది. విధేయతలు,నిర్ధారింపుల చిక్కుముళ్లలో తాను చిక్కుకుని తనతో నడుస్తున్న బి సి కవులను పక్కనపెట్టింది. దళితులు అంటే కేవలం యెస్ సి లు, వాళ్ళు రాసిందే దళిత కవిత్వం అనే నిర్ధారణకు వచ్చింది.

ఈ పరిణామాన్ని ముందే గ్రహించిన ప్రసేన్ లాంటి విమర్శకులు "మాల బ్రాహ్మల దళిత ధాష్టీకం","ఆ విమర్శకుడి ఎడమ కన్ను గుడ్డిది" లాంటి వ్యాసాలు రాసి,దళిత కవిత్వాన్ని సెల్ఫ్ ఇంటరాస్పెక్షన్ చేసుకోవాల్సింది గా మంచి సలహాలు ఇచ్చారు.

ఈ నేపథ్యం లో జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వం లో ఇరవైముగ్గురు కవులు కలిసి "వెంటాడే కలాలువెనుకబడిన కులాలు" శీర్షికన ఒక సమగ్ర కవిత్వ సంపుటిని తీసుకుని వచ్చారు. ఈ కవిత్వ సంపుటికి ప్రసేన్, గౌరీశంకర్ ఆలోచనాత్మక ముందు మాట రాసారు. ఆ ముందుమాటకు దళితాత్మకవిత అని పేరు పెట్టారు. దళిత కవిత్వాన్ని బిఫోర్ క్రిస్ట్ నుండి ఏ.డి లోకి నడిపించే కవిత అనే ఒక ట్యాగ్ లైన్ ఉంచారు. ఇలా పేరు పెట్టడం ద్వారా దేశీయ మార్క్సిజం తాత్విక భూమిక గా యెస్.సి,యెస్ టి,బీసీ.మైనారిటీలు కలసి సంఘటితంగా,ఐక్యంగా ఉద్యమం చేయాలనీ లక్ష్యాన్ని సాధించుకోవడం కోసం, దళిత కవిత్వం లోని విపరీత



ఒంటెద్దు పోకడలు పోయిన దళిత కవిత్వం మాల కవిత్వం,మాదిగ కవిత్వం గా విడిపోయింది తప్ప ఆత్మ పరిశీలన చేసుకోలేదు. తెలుగులో అస్తిత్వ ఉద్యమాలకు సమాంతరంగా ఆర్థికరంగం లో వచ్చిన లిబరలైజేషన్,ప్రైవేటైజేషన్,గ్లోబలైజేషన్ విధానాలను పట్టించుకోవలసినంత గా దళిత కవిత్వం పట్టించుకోలేదు. LPG విధానాల వలన వ్యవసాయ రంగం కుదేలు అవుతున్నా, చేతి వృత్తులు అంతరిస్తున్న స్పందించాల్సినంత వేగంగా, గాఢంగా స్పందించలేదు. ఆత్మగౌరవం అనే పదాన్ని అస్తిత్వానికి ప్రతీకగా మాత్రమే తీసుకుని అదొక జీవన విధానం అన్నమాట ను దళిత కవిత్వం మరచిపోయింది



జులూరి గౌరి శంకర్
మాజీ తెలంగాణ
సాహిత్య అకాడమి అధ్యక్షులు
9440169896

పోకడలనుండి దళిత కవిత్వాన్ని రక్షించుకోవాలనే సంకల్పాన్ని బలంగా ముందుంచారు

ఆ లక్ష్యం నెరవేరిందా? అన్న ప్రశ్న ఈ రజతోత్సవ వేళ వేసుకుంటే సమాధానం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి అవును. రెండు కాదు. కాదు ఎందుకంటే కలసి నడవాలనే, వుమ్మడి లక్ష్యం అనే సంకల్పం నెరవేరలేదు. సమాజం,సమాజం తో పాటు కవులు కులాల వారీగా విడిపోయారు. ఎవరి కవిత్వం వాళ్ళే రాసుకుంటూ, ఎవరి సంస్థలు వాళ్ళు నడిపించుకుంటూ,ఎవరి పురస్కారాలు వాళ్ళు ఇచ్చుకుంటూ మైక్రో నుండి మ్యాక్రో స్థాయికి విడిపోయారు. "నా తమ్ముడి ఎంగిలి కంచాన్ని కడగమని నాకెవరూ చెప్పనక్కర లేదు" అన్న వాళ్ళు తమ్ముడి కంచాన్ని పట్టించుకోవడం మానేశారు. కుల విమోచన పక్కన పెడితే కులస్థిరీకరణ మాత్రం బాగా జరిగింది.ఆ తరువాత వచ్చిన హిందూత్వ రాజకీయాలు అస్తిత్వ ఉద్యమాలకు చుక్కలు చూపించి, మతాన్ని ప్రాతిపదికగా తీసుకుని రావడం లో విజయం సాధించాయి. నెమ్మదిగా దళితులకు రాజ్యాంగ నిర్దేశించిన రిజర్వేషన్లను కూడా తీసివేయగల సామర్థ్యాన్ని హిందూత్వ రాజకీయాలు పొందటం లో మ్యాక్రో నుండి మైక్రో వరకు శకలాలు గా విడిపోవడం చేసిన దోహదం విస్మరించదగినది కాదు




ఇక అవును ఎందుకంటే ఇవాళ జనగణమన కాదు బహుజనగణమన అని అనాలి అనే స్థాయికి బహుజనోద్యమం చేరుకుంది. దేశవ్యాపితముగా కుల గణన చేస్తే వచ్చే ప్రమాదాలను,గమనించి వాయిదా వేస్తూ వస్తున్న ప్రభుత్వాల మెడలు వంచి కులగణన చేయడానికి అంగీకరింప చేయడం లో బహుజనోద్యమ ఒంటరి పోరాటాన్ని విస్మరించలేము

ఐక్యతా స్వప్నం శకలాలుగా విడిపోయి సామాజికంగా, రాజకీయంగా కుల స్థిరీకరణకు దారితీసినా... బహుజన ఆత్మగౌరవ స్పృహను పదునెక్కించడంలో ఈ సంకలనం విఫలం కాలేదు. ఇవాళ దేశ సరిహద్దులను దాటి ప్రతిధ్వనిస్తున్న "కుల గణన" డిమాండ్ వెనుక, సంక్షేమ ఫలాల పునఃపంపిణీ పోరాటం వెనుక ఈ కవుల కలాలు రగల్చిన చైతన్యపు విత్తనాలు ఉన్నాయి. వర్తమాన హిందూత్వ రాజకీయాల సవాళ్లను ఎదుర్కొంటూ, సమగ్ర సమాజ నిర్మాణమే లక్ష్యంగా "బహుజనగణమన" ఆశయా దిశగా అడుగులు వేయడమే ఈ రజతోత్సవ సందర్భంలో "వెంటాడే కలాలు" సంకలనానికి వున్న ప్రాసంగికత

వంశీకృష్ణ
9573427422

# రెప్పల కింద దాగిన దుఃఖాక్షరం అజేయుడు

కథో,కల్పనలో తెలియని శాపగ్రస్తుడైన రాధేయుని మాటకేంగానీ సాహితీ ప్రపంచంలో అందులోనూ కవికులజుడైన రాధేయుడు నిజంగా శాపగ్రస్తుడే.

బాల్యం నుండి ఎన్నో హర్డిల్ రేసులు దాటిన వానికి హమ్మయ్య అని వూపిరి తీసుకునే విశ్రాంతి సమయంలో మళ్ళామళ్ళా ఎదురు దెబ్బలు తగులుతూనే వుండటం శాపమౌనో కాదోగానీ కనిపించని కముకుదెబ్బలు.అవి ఎవరికీ చూపించలేనివి.కన్నీటితో తడిచి,నాని నాని ఛిద్రమైపోతోన్న గాయాల్ని ఎలా చూపాలి?

అందుకే కవి మాత్రమే చూపించగలిగే సాధనం అక్షరం మాత్రమే.మరందుకే మనకి తెలిసిన ఈ శాపగ్రస్తుడైన రాధేయుడు రాసిన కన్నీటి అక్షరం అజేయుడు.

"నా కళ్ళే కాదు, చేతి వేళ్ళు సైతం
తడి తడిగా చెమరిస్తూన్నాయి
ఏ పేపరు ముట్టుకున్నా,
ఏ వస్తువును స్పర్శించినా
మాకు తడితడిగానే తగిలాయి"అంటూ రాసిన దుఃఖ ప్రవాహమే అజేయుడు

అవార్డులకి నేనున్నానని భరోసా అందించిన వాడు ఈనాడు 'మట్టిదుప్పటి' కింద ప్రశాంతంగా నిద్రిస్తుంటే సతీషుడిని మేల్కొల్పలేక
" గుండె పట్టలేనంత దుఃఖాన్ని
తోడి పోస్తూ
అరచేతులతో గొంతును బిగించి పట్టి"న కాలాన్ని నిందించలేని తండ్రి రాసిన దుఃఖాక్షరమే అజేయుడు.
'తోడులేని ఎడారిలో దుఃఖమే తోడుగా
/కన్నీరే ఆసరాగా' ఒంటరియైన తండ్రికి ఓదార్పులూ ,పలకరింపులు కన్నా సాంత్వన కలిగించేవి ఏమిటి?

"నా ఏకాంత స్నేహం కవిత్వంతోనే" అంటాడు
"రోజూ ఒక కొత్త వాక్యాన్నె
పునర్జన్మ పొందాలనుకుంటాను
అలలు అలలుగా, కలలు విరిగి పడుతూ
రాసుకున్న వాక్యాలను
మళ్ళీమళ్ళీ చెరిపేసుకుంటున్నాను"
అంటూనే దుఃఖాన్ని గుండెలోతుల్లోంచి తవ్వుకుంటూనే వుంటాడు.
"జీవన మహాకావ్యాలన్నీ/కన్నీటి బొట్టు సముదాయమే" అని తెలిసినవాడే ఈ రాధేయుడు
అందుకేనేమో నిరంతరం ' అక్షరాల్లో ప్రాణం నింపుకొని దహనం మౌతున్నవారిలో 'తనని తాను వెతుక్కుంటాడు

ఎవరికోసం ఎవరూ ఆగరని తెలిసిన కవి.మధ్యతరగతి మందహాసాన్ని నిత్యం పెదాలపై అతికించుకుని బతుకుతున్నవాడు అయిన రాధేయునికి తానూ ఒక మనిషినేనని తెలిసినా
"మన భావోద్వేగాలు
నిత్యం ఒడ్డును ఢీ కొట్టే అలలు
ప్రేమలు, అభిమానాలు, త్యాగాలు
అన్నీ ట్రాష్..."అనే తాత్వికత లోనికి ప్రయాణిస్తాడు.

నిదుర పట్టని చీకటిరాత్రుల్ని విషాదంతో అక్షరీకరిస్తూ ...
"జీవితమంటే ఎడతెగని పోరాటమని




ఓడిపోతామని తెలిసినా
యుద్ధం చేయాల్సిందేనని " తనని తానే పురిగొల్పుకుంటూ ఓదార్చుకుంటాడు.

కాలానికి ఎవరి దుఃఖాలతోనూ పనిలేదు.తన మానాన్న అది ప్రయాణిస్తూనే వుంటుంది.ఎటొచ్చీ ఎదిగిన పుత్రుడు దూరమైన తండ్రికే ఉగాదులూ ఉషస్సులూ లేని కాలం నత్తనడక నడుస్తుంది.

రేపటి రోజుని కోల్పోయానని తెలిసీ ఈరోజు బతికివున్న తండ్రి రాధేయుని దుఃఖమే అజేయుడు. రాధేయుడే కాదు ఏ తండ్రికయినా అది ఆగనిదుఃఖం. అంతటి దుఃఖాన్ని ఎన్ని అక్షరాల్లో పోగు పోస్తే ఆర్తి తీరుతుంది.గుండెలోని రక్తాన్నితోడి ,కంటిచెమ్మని కలగలిపి మనిషి మనషంతా కలంగా మారి ఎన్ని అక్షరాల్తో కాగితాన్ని తడిపితే సాంత్వన కలుగుతుంది.
"కళ్ళముందే అటు సహచరినీ,
ఇటు కొడుకును
ఇద్దర్నీ కోల్పోయిన ఒక అభాగ్య తండ్రిని
మీరెప్పుడైనా చూశారా?
ఆ అభాగ్య తండ్రినీ..
దురదృష్ట భర్తనూ నేనేనయ్యా!" అంటూ కన్నీరు మున్నీరుగా మారి సముద్రంగా మారిన రాధేయుని దుఃఖం ఒక జీవనదిలాగా డెబ్భైఅయిదు అంకాలుగా ప్రవహించింది.
" నిత్యం నిన్ను అక్కున చేర్చుకునే
బెడ్ రూమ్, డ్రెస్సింగ్ టేబుల్,
పుస్తకాలు, డైరీలు, పేపర్లు, ప్రతి వస్తువు
నువ్వింక రావని తెలుసుకొని
వెక్కి వెక్కి ఏడుస్తున్న దుఃఖం
నిజంగా ఒక కన్నీటి సాగరం "రాధేయునే కాదు అక్షరాలవెంట నడుస్తున్న పాఠకుల చూపుల్నీ తడిపేస్తూనే వుంటుంది.

రెమ్మలుగా,కొమ్మలుగా విస్తరించిన ఉమ్మడిశెట్టి కవితావృక్షంకింద చేరిన కవులు , యువకులు , సాహితీవేత్తలు ఎంతమందికి నీడనిచ్చిందో.వారంతా రాధేయుని కుటుంబమే కావచ్చు.ఇంతమందిని చేర్చుకున్న నీడ కింద సతీష్ కి చోటు లేకుండా పోయింది అదే విషాదం.

అయితేనేం ఆ రాధేయుని లక్ష్యం పక్షికన్నే కావచ్చు .ఈ రాధేయుడు దుఃఖం వస్తే వర్షించటానికి కళ్ళను సిద్ధం చేసుకున్నవాడు.బాధను దిగమింగి,నవ్వుతూ బతకడాన్ని నేర్చుకున్నవాడు.అక్షరాన్నే ఆలింగనం చేసుకున్న వాడు.
"అంతర్ బహిర ఘర్షణే జీవితం
ఆ ఘర్షణ తాలూకు వేదనే కవిత్వం
రెప్పల కింది దుఃఖమే అక్షరం" అన్న విషయాన్ని మననం చేసుకుంటూ,చేసుకుంటూ దుఃఖాన్ని "అజేయుని"గా మలిచినవాడు.

సతీష్,సత్యాదేవిల గూర్చిన కలలూ,జ్ఞాపకాలూ,అనుబంధాలూ,స్నేహాలూ ఇంకిపోనంతకాలం కవిత్వమే రాధేయుని తీర్చి దిద్దుతూనేవుంటుంది. తానే చెప్పుకున్నట్లు "ఏకాంత మానససరోవరంలోనే ధ్యానయోగిగానే వుంటారు" అంతవరకూ మీరూ,నేనే కాదు దుఃఖం కాటేసిన మనమందరం మననం చేసుకునేది,చేసుకోవాల్సిందీ ఇదే కదా
"నన్ను ప్రేమించేవాళ్ళు
నా గాయాలనూ ప్రేమిస్తారు
జీవితమంటేనే
ఒకరికొకరు ఓదార్చుకుంటూ
బతకడమే కదా మిత్రమా!"



శీలా సుభద్రాదేవి
8106883099

ప్రముఖ తత్వకవి ఉదారి నాగదాసు స్మారక కవితా పురస్కారం 2026వ సంవత్సరానికి గాను ప్రముఖ కవి, రచయిత మునిమడుగుల రాజారావు గారు ఎన్నికయ్యారు. ఈ అవార్డును సెప్టెంబర్ 27వ తేదీ 2026న ఆదిలాబాద్ లో ఉదారి నాగదాసు వర్ధంతి సభలో ప్రదానం చేయబడును.ఈ అవార్డు కింద ఐదు వేల రూపాయలు(5000) నగదు ప్రశంసా పత్రం అందజేయబడును.

**నిర్వాహకులు**

డాక్టర్ ఉదారి నారాయణ ఉదారి,
నాగదాసు కుటుంబ సభ్యులు,
9441413666

# దర్వాజాలు తెరిచిన వీధులు

మేల్కొని వుండడంలోనే
జీవితం గడిచి పోయింది
పోరాటంలో విశ్రాంతి వుండదు
వెన్నెలుంటుంది, రాత్రులుండవు

అమ్మవో, నాన్నవో, గురువువో, గుర్తులున్నాయి
ఇంకా తడి తడిగానే, కళ్లలో మిగిలి నట్టున్నాయి
నీడల్లా జ్ఞాపకాలు, వెంట నడుస్తున్నాయి

ఎందరో కలుస్తారు, ఎవరెవరో విడిపోతారు
ఎవరి కథలేమిటో అడగాలని వుంటుంది
మాట పరిమళంలా ఇగిరి పోతుంది

కన్నీళ్లు, పడవలు మునిగే సముద్రాలు కాకూడదు
ఉదయాలు వికశించే స్వప్నాలు కావాలి
గాలి, మనుషులు నిద్రలేచిన, పులకింతై వీచాలి

కట్టుకట్టిన గతాన్ని, విప్పి చూడ కూడదు
ఎగిరి పోవడానికి తగిలిన దెబ్బలు పక్షులు కావు
ఎండిపోయిన ఆకుల్లా, మరిచిపోయి రాలి పోవాలి

అందరి ముందు, ఎక్కువగా హుషారుగా వుండకు
నీవు బాధలు దాచుకుంటున్నావని, తెలిసిపోతుంది

ముసుగులా వెన్నెల పక్కకు జారుతుంది
దినం, కళ్లు నులుపు కొంటున్న, చిన్న పిల్లాడిలావుంది

పేపర్ కుర్రాళ్లు, పూలమ్మే సైకిళ్లు,
దూరందాకా, దర్వాజాలు తెరిచిన వీధులు

వెలుతురూ, గాలీ, నేలా, నీలాకాశం
మనిషి తడికళ్లలోని, అలల దృశ్యాలు



ఆశారాజు
9392302245

# కొన్ని మరువని స్మృతులు..!

నడిచొచ్చిన తొవ్వల్లోని
అనుభూతుల జ్ఞాపకాలు
వెంటాడుతు స్పర్శిస్తుంటాయి..!

అడవి గాలి పరిమళాలు
తనువంతా అల్లుకుంటాయి
అడవంటే పచ్చని చెట్లే కాదు
నడయాడుతున్న ఆదివాసులు కూడా
వాళ్ల జీవితాల్లోని విడువని
పోరాటాలు ఉత్తేజపరుస్తాయి
వాళ్ళ మాటల్లోని సూటిదనం
ఎక్కుపెడుతున్న బాణాల్లాగుంటాయి..!

అరణ్యంలో పులుల సంచారంతో
చెల్లా చెదురైన ఆదివాసులే
కళ్ళ ముందు కదలాడుతుంటారు
శిధిలమైన రాంపూర్ ని చూస్తే
ఒకప్పుడు పచ్చని చెట్ల నీడల్లో
సేదతీరిన దృశ్యాలే గుర్తుకు వస్తుంటాయి..!

ఎన్నో పర్యాయాలు
ఆ ఎత్తైన పర్వతాల నుండి
గండి పోచమ్మను దాటుతూ వెళ్ళాను
ఉదుంపూర్, బీర్సాయిపేట, అల్లంపల్లి
దంతన్ పల్లి,ఘనపూర్, కొలాంగూడా కొత్తగూడెం
ఊరు పేరు ఏదైనా కావచ్చు
విధ్వంసమవుతున్నది అడవొక్కటే కాదు
ఆ ఒడిలోని అడవి పుత్రులు కూడా
ఒకప్పుడు అది దట్టమైన అరణ్యమే
ఇప్పుడది కరిగిపోతూ కనుమరుగైపోతూ
పలుచబడిన దేహంతో విలవిలాడుతున్నది..!

ప్రశాంతమైన సాయంత్రాలు
సుందరమైన సూర్యోదయాలు
కనుచూపు మేర దట్టంగా పరుచుకున్న
పచ్చదనపు సొగసు వర్ణం
వరుసగా పేర్చబడినట్లున్న కొండలు
స్వర మాధుర్యంతో పరవళ్ళు తొక్కే సెలయేళ్ళు
వర్షాధారమైన ఆహారపు పంటలు
అడుగడుగునా కానవచ్చే పూజ స్థలాలు
రాలిన ఆకుల గలగల చప్పుళ్ళు
స్మృతి పదంలోని అనుభూతులు నిలువనీయవు..!

ఒక్కొక్కసారి అనుకుంటాను
ప్రేమమయమైన ఉట్నూర్ అడవిని వదిలి
పట్టణాల బాట పట్టడం అవివేకమని
ఆ తిరిగిన దారులన్నీ
నన్ను ప్రశ్నిస్తున్నట్లుగానే ఉంటాయి
దిశ మారిన గాలులు వేగంగా వీస్తున్నాయి
మనిషి అంటేనే సంచార జీవి
ఒక దగ్గరనే ఉండడమనేది సాధ్యం కానిది
జీవన సౌందర్యాన్ని ఆస్వాదించాలంటే
అమ్మలాంటి అడవితనాన్ని
కాపాడుకోవడం కూడా మన కర్తవ్యమే..!

జల్ జంగల్ జమీన్ నినాదం
ఏ ఒక్కరిదో కాదిప్పుడు
చైతన్యవంతమైన గ్రామాలది
పోరు కెరటాలు ఊరూరా విస్తరించాయి
సామాజిక మాధ్యమాల్లో రగులుతున్న
దీనావస్థలను చేధిస్తున్న వీరగాధలున్నాయి
కన్నీటి ధారల మధ్యన
తలవంచని ఆత్మస్థైర్యాలున్నాయి
జనం కోసం బతికేవాళ్ళే
జనం ఆశయాలకు ప్రతినిధులు ..!

సేద తీరినంత మాత్రాన ప్రయాణం ఆగినట్లు కాదు
దారులన్నీ ఒకటి కావెప్పుడు
ఎదురుచూడని మూల మలుపులుంటాయి
నాలుగు బాటల కూడళ్ళుంటాయి
వేరు వేరు దారుల్లో పయనించిన కానీ
శిఖరంపైన రెపరెపలాడమే కావాలిప్పుడు..!



గోపగాని రవీందర్
94979882౫

# జర్నలిస్టుల హక్కుల కోసం ఒక్కటైన కలం

- **యూనియన్లు, ప్రెస్‌క్లబ్‌లకు అతీతంగా ఐక్యవేదిక**
- **సమస్యల పరిష్కారానికి సమష్టి పోరాటమే లక్ష్యం**
- **సత్తుపల్లి జర్నలిస్టుల ఐక్యత రాష్ట్రానికి ఆదర్శం**



**సత్తుపల్లి, సెప్టెంబరు 13:మహా:** జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాలని సత్తుపల్లి జర్నలిస్టులు నిర్ణయించారు. వివిధ జర్నలిస్టు సంఘాలు, యూనియన్లు, ప్రెస్‌క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు సదాశివునిపేటలో నిర్వహించిన ఐక్య వేదిక సమావేశంలో ఒకే వేదికపైకి వచ్చారు. జర్నలిస్టుల ప్రయోజనాల విషయంలో సంస్థలు వేరైనా లక్ష్యం ఒక్కటేనని స్పష్టం చేశారు.

**హక్కుల కోసం ఉమ్మడి గళం**

జర్నలిస్టుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, సంక్షేమం వంటి ఉమ్మడి అంశాలపై ఇకపై సమష్టిగా స్పందించాలని సమావేశంలో నిర్ణయించారు. వ్యక్తిగత, సంస్థాగత విభేదాలను పక్కనపెట్టి జర్నలిస్టుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తమైంది. ఐక్యంగా గళమెత్తినప్పుడే సమస్యలను సంబంధిత ప్రభుత్వ విభాగాల దృష్టికి బలంగా తీసుకెళ్లి పరిష్కారాలు సాధించగలమని పేర్కొన్నారు.

**స్నేహమే బలం.. ఐక్యతే మార్గం**

ఒకరి సమస్యకు మరొకరు అండగా నిలుస్తూ, విజయాలను పరస్పరం అభినందించుకునే స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని సమావేశం ఆకాంక్షించింది. జర్నలిస్టుల మధ్య పరస్పర గౌరవం, సహకారం, ఆత్మీయత మరింత బలోపేతం కావాలని నిర్ణయించారు. సంఘాల మధ్య ఉన్న భేదాలు జర్నలిస్టుల ఉమ్మడి ప్రయోజనాలకు అడ్డంకిగా మారకూడదని స్పష్టం చేశారు.

**సత్తుపల్లి నుంచి రాష్ట్రానికి సందేశం**

వివిధ సంఘాలు, సంస్థలకు చెందిన జర్నలిస్టులు ఒకే వేదికపైకి వచ్చి ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పని చేయాలని నిర్ణయించుకోవడం సత్తుపల్లి జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ ఐక్యత రాష్ట్రంలోని జర్నలిస్టు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో జర్నలిస్టులకు సంబంధించిన ఉమ్మడి సమస్యలపై సమష్టి నిర్ణయాలతో ముందుకు సాగాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. సంఘాలు వేరైనా.. హక్కుల కోసం గొంతు ఒక్కటే. కలాలు వేరైనా.. జర్నలిస్టుల ప్రయోజనాల కోసం దిశ ఒక్కటే అనే స్ఫూర్తితో ఐక్యతను కొనసాగించాలని సమావేశం పిలుపునిచ్చింది. సత్తుపల్లి నుంచి జర్నలిస్టుల ఐక్యతకు బలమైన సందేశం వెలువడింది.

# మార్కెట్లో గణేష్ చవితి జోష్

- **వివిధ ఆకృతులలో విగ్రహాలు**
- **కొనుగోలు దారులతో సందడి**
- **ఉత్సవాలకు సిద్ధమైన గణపయ్య**
- **అందంగా ముస్తాబయిన మండపాలు**



**ఆదిలాబాద్ మహా:** వినాయక నవరాత్రోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆదిలాబాద్ పట్టణంలోని గణేష్ మండపాలు గణపయ్య పూజల కోసం ముస్తామవుతున్నాయి.కొన్ని మండపాలు ఇప్పటికే సర్వాంగ సుందరంగా తయారై ఉండగా మరి కొన్ని మండపాలలో ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. ఆయా మండపాలకు వివిధ రూపాలలో ఉన్న గణేష్ విగ్రహాలు ఇప్పటికే చేరుకుని సోమవారం తొలి పూజ కోసం సిద్ధమయ్యాయి.ఇక ఉన్నచోటనే రూపుదిద్దుకొని అక్కడే నిమజ్జనం కానున్న కుమార్ పేట్ నూతి మీద గణపతి భారీ విగ్రహం ఏర్పాట్లు కూడా దాదాపు పూర్తయ్యాయి.భక్తులకు ఇబ్బంది కలగకుండా దర్శనాలు పూజల కోసం కొన్ని మండపాలలో ప్రత్యేక బారి కేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.ఇక తొమ్మిది రోజుల పాటు నవరాత్రోత్సవాల సందడితో పట్టణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. అటు వినాయక విగ్రహాల ఆగమన్ కార్యక్రమాన్ని మండపాల నిర్వాహకులు ఘనంగా చేపట్టారు. బ్యాండు మేళాలు, నృత్యాలతో ఊరేగింపుగా విగ్రహాలను మండపాలకు తరలిస్తున్నారు. మరో వైపు సోమవారం జరిగే వినాయక చవితిని పురస్కరించుకొని ఆదిలాబాద్ మార్కెట్లన్నీ కళకళలాడుతున్నాయి. రంగురంగులతో వివిధ ఆకృతులలో బొజ్జ గణపయ్య విగ్రహాలు , పర్యావరణానికి దోహదపడే ఎకోఫ్రెండ్లీ మట్టి గణపతులు మార్కెట్లలో అమ్మకానికి కొలువుతీరాయి. విగ్రహాలతో పాటు పూజలకు అవసరమయ్యే పత్రి దళాలు ,వివిధ రకాల ఆకులు పువ్వులు, గుమ్మాలకు తోరణాలు కట్టేందుకు మామిడాకులు ఇతరత్రా పూజా సామగ్రి అంతా ఒకే చోటనే ఉండడంతో కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ సందడి గా మారాయి. అయితే పర్యావరణ హితంగా పండగ జరుపుకునేందుకు ఆసక్తి చూపుతూ ఎక్కువగా మట్టి ప్రతిమలనే కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు.



## వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలి

**వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, కలెక్టరేట్ మహా:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వరంగల్ జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని, ఆకాంక్షించారు.వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతోజరుపుకోవాలని కలెక్టర్ కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించాలని మట్టి గణపతికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలు, రసాయనిక రంగుల వినియోగాన్ని నివారించాలని సూచించారు. ముఖ్యంగా విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లాలో రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండి, పంటల సాగు అనుకూలంగా కొనసాగి రైతులు సుభిక్షంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను అలాగే నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో, పరస్పర సహకారంతో నిర్వహించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భక్తి భావంతో, హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా పండుగను నిర్వహిస్తూ సమాజంలో సోదరభావం, ఐక్యతను చాటాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రజలు నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# డీజేల హోరు ...గుండెలు బేజారు.

- **హై డెసిబెల్స్ సౌండ్ తో ప్రాణనష్టం**
- **చెవుడు వచ్చే ప్రమాదం**
- **కోర్టు , పోలీసు ఆదేశాలు బేఖాతరు**
- **ఆగని చప్పుళ్లు.. ఆగిపోతున్న గుండెలు**



**ఆదిలాబాద్ మహా :** వివాహ వేడుకల బరాత్ లు , నవరాత్రులు , ఊరేగింపులు ఉత్సవాలు ఏవైనా వేడుక ఏదైనా ముందుగా వినపడేది డీజే సౌండ్. ఆధ్యాత్మిక శోభాయాత్రల్లో భక్తి కంటే ఎక్కువ డీజేల హోరు, డోల్‌భాజా, బ్యాండ్ శబ్దాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. మితిమీరిన శబ్దాల వల్ల సాధారణ ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, పసిపిల్లలు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. శబ్ద కాలుష్యం ప్రజల ప్రాణాల మీదకు తెస్తోందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన డీజే సౌండ్ వైబ్రేషన్ల వల్ల గుండె లయ తప్పుతుందని, ఇది సడన్ కార్డియాక్ అరెస్ట్ కు దారితీసే ప్రమాదం ఉందని కార్డియాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే గుండె జబ్బులు ఉన్నవారు, స్టెంట్లు వేయించుకున్న వారు ఈ శబ్దాల వల్ల తీవ్ర అస్వస్థతకు లోనవుతున్నారు. మరోవైపు, 110 డెసిబెల్స్ శబ్దాల మధ్య గంటల తరబడి గడపడం వల్ల చెవిలోని సున్నితమైన నరాలు దెబ్బతిని, శాశ్వతంగా చెవుడు వచ్చే ముప్పు ఉంది. గర్భిణీ స్త్రీలలో తీవ్రమైన ఒత్తిడి పెరిగి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. పసిపిల్లలు, వృద్ధులు తీవ్రమైన శబ్దాన్ని తట్టుకోలేక పోతున్నారు. మూగజీవాలు శబ్దాల తాకిడికి దరిదాపుల్లోకి రాకుండా పారిపోతున్నాయి.

**డీజే సౌండ్ లకు బలి**

సెప్టెంబర్ 2, 2026 న నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో స్నేహితుని ఇంట్లో జరిగిన పెళ్లి వేడుకలో ఇంటర్మీడియట్ విద్యార్థి రవితేజ (17) డీజే పాటలకు డాన్స్ చేస్తూ, ఆ భారీ శబ్దాల తీవ్రతకు ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు.

నిర్మల్ జిల్లా కేంద్రంలో గత బతుకమ్మ వేడుకలలో బంగల్‌పేట్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న బిట్లింగ్ భాగ్యలక్ష్మి (56) డీజే సౌండ్ వల్ల గుండెపోటుకు గురై దవాఖానలో చికిత్స పొందుతూ మరణించింది.

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పాత కారాయిగూడెంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో డీజే శబ్దాల మధ్య డ్యాన్స్ చేస్తూ దూదిపాళ్ల సత్యనారాయణ అనే వ్యక్తి హఠాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి ఆసుపత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయాడు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన గణేష్ నిమజ్జనోత్సవంలో భారీ డీజే సౌండ్ ఎఫెక్ట్ కారణంగా ఒక యువకుడు తీవ్ర అస్వస్థతకు లోనై ప్రాణాలు విడిచాడు. ఏపీ లోని అమలాపురంలో అక్టోబర్ 2024లో దసరా ముగింపు వేడుకల్లో భాగంగా దుర్గామాత విగ్రహ ఊరేగింపులో ఏర్పాటు చేసిన భారీ డీజే బాక్సుల శబ్ద ధాటికి పప్పుల వినయ్ (21) కార్డియాక్ అరెస్ట్‌కు గురై మరణించాడు. విజయనగరంలోని బొబ్బిడిపేటలో గణేష్ నిమజ్జన ఊరేగింపులో హైడెసిబెల్ డీజే శబ్దాల మధ్య డ్యాన్స్ చేస్తూ డిగ్రీ విద్యార్థి బి. హరీష్ (22) గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు.

**నిబంధనలు**

డీజే మితిమీరిన శబ్దాల నియంత్రణపై హైకోర్టు సుప్రీంకోర్టు ఆదేశాలను ఆధారంగా చేసుకుని పోలీస్ శాఖ కఠినమైన మార్గదర్శకాలను జారీ చేసింది. వేడుకలు ఊరేగింపులలో నిబంధనల ప్రకారం నివాస ప్రాంతాలలో పగటిపూట శబ్ద తీవ్రత 55 డెసిబెల్స్ , రాత్రి వేళల్లో 45 డెసిబెల్స్ మించకూడదు.అదే రాత్రి పది దాటితే పూర్తి నిషేధం అమలలో ఉంది. కాని దీనిని పాటించేది ఎందరు. సాంప్రదాయాలు సరదాల పేరుతో ఉత్సవ నిర్వాహకులు ,రాజకీయనేతల ఒత్తిళ్ల తో పోలీసులు సైతం కొన్ని చోట్ల చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. పరిమితులకు లోబడి అనుమతిస్తున్నారు కాని అసలు పరిమితి 55 డెసిబెల్స్ కు మించి దాదాపు 110 డెసిబెల్స్ శబ్దం వినిపిస్తోంది. నిమజ్జన ఊరేగింపుల్లో వాడే భారీ డీజే సౌండ్ సిస్టమ్స్, 2030 మందితో కూడిన డోల్ భాజా, బ్యాండ్‌లు ఏకంగా 100 నుండి 115 డెసిబెల్స్ పైగా శబ్దాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. ఇది పరిమితి కంటే రెట్టింపు తీవ్రత .దీంతోనే గుండె ఆగిపోతోంది... వినికిడి శక్తి తగ్గి పోతోంది.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

డీజేలు డోల్ బాజా లేదా బ్యాండ్ శబ్దాలతో నిమజ్జన ఊరేగింపుల్లో పాల్గొనేవారు కనీసం వాటికి 2030 మీటర్ల దూరంలో ఉండాలి. వీలైనంత వరకు ఇయర్ ప్లగ్స్ లేదా దూదిని చెవులలో ఉంచుకోవాలి.పండుగ నిర్వాహకులు స్వచ్ఛందంగా శబ్ద పరిమితిని తగ్గించి, సంప్రదాయ సంగీతానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే డీజేలకు పోలీసులు అనుమతివ్వకపోవడంతో డోల్ భాజా బ్యాండ్ ల వైపు మొగ్గుతున్నారు. ఆయా గ్రూపులోని వారి సంఖ్య పది కంటే ఎక్కువగా ఉంటే దాని శబ్ద తీవ్రత కూడా ఇంచుమించు ప్రమాదకరస్థాయిని సూచిస్తుంది. ప్రజాశ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని నిర్వాహకులు శబ్దపరిమితి దాటేలా ఏర్పాట్లు చేయకూడదని పలువురు కోరుతున్నారు.

**పోలీసుల సూచనలు**

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో జిల్లా పోలీసులు డీజేల పట్ల కాస్తా కఠినంగానే ఉన్నారు. గణపతి ప్రతిష్ఠాపన, నిమజ్జనం రోజున డీజేలు, టపాకాయలు, స్మోక్ బాంబులు, పేపర్ చల్లే యంత్రాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇటీవలే బోథ్ లో టెస్టింగ్ పేరుతో డీజే శబ్దాన్ని చెవులు చిల్లులు పడేలా పెంచడంతో పోలీసులు డీజే సిస్టమ్ ను స్వాధీనం చేసుకుని యజమాని పై కేసు నమోదు చేసారు. పోలీసుల సూచనలు పాటిస్తూ అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రశాంతమైన వాతావరణంలో సాంప్రదాయబద్ధంగా పండగలు నిర్వహిస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

**వైద్యుల వివరణ**

ఈ మరణాలకు గల శాస్త్రీయ కారణాలు విశ్లేషిస్తే భారీ సౌండ్ సిస్టమ్స్ నుండి వచ్చే బేస్ వైబ్రేషన్లు 100 డెసిబెల్స్ దాటిన శబ్దాల వల్ల మానవ శరీరంలో అడ్రినలిన్ హార్మోన్ అకస్మాత్తుగా పెరిగి, గుండె కొట్టుకునే వేగం అసాధారణంగా మారుతుంది. ధ్వని కాలుష్యం వల్ల బీపీ వేగంగా పెరిగి గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలు కుంచించుకుపోతాయి. ఇది గుండెపోటు లేదా బ్రెయిన్ హెమరేజ్‌కు దారితీస్తుంది. గంటల తరబడి నిద్రలేకుండా, డీజేల ముందు అధికంగా శ్రమించడం కూడా యువకులలో సడన్ కార్డియాక్ అరెస్ట్‌కు ప్రధాన కారణం అవుతోందని కార్డియాలజిస్టులు చెబుతున్నారు




# ప్రజల్లో చైతన్యానికి నిదర్శనమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

- **బెల్లంపల్లి పట్టణ సిపిఐ సమితి కార్యదర్శి ఆడెపు రాజమౌళి**

**బెల్లంపల్లి ,మహా:** ప్రజల్లో చైతన్యానికి వారధిగా నిలిచింది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అని బెల్లంపల్లి పట్టణ సిపిఐ సమితి కార్యదర్శి ఆడెపు రాజమౌళి పేర్కొన్నారు. ఆదివారంనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 70 వార్షికోత్సవ సెప్టెంబర్ 11 నుండి 17 వరకు వారోత్సవాలు సిపిఐ మంచిర్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే జాతా లో భాగంగా బెల్లంపల్లి పట్టణంలో భగత్ సింగ్ విగ్రహం వద్ద పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ను జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఎగురవేయగా ,భగత్ సింగ్ విగ్రహానికి జాత నాయకులు మేకల దాస్ , రేగుంట చంద్రశేఖర్ , బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ , సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాగం మల్లేష్‌మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, దొరల జమీందారుల దోపిడీ దౌర్జన్యాలకు వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీలు ప్రజల్లో కలిగించిన చైతన్యంతో ప్రజలు తిరుగుబాటు జరిపినారు. విసునూరి దొర దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాటంలో గుండాలకు తుపాకి గుళ్ళకు బలైె దొడ్డి కొమురయ్య తొలి అమరులయ్యాడని, ఆదిలాబాద్ జిల్లాలో నుండి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దాది శంకర్రావు, రామకృష్ణ శాస్త్రి, కష్టాల రామకృష్ణ, బాసెట్టి గంగారం, పోతుగంటి పోశెట్టి, జె కుమారస్వామి నిజాం నిరంకుశ పాలనకు దొరల జమీందారుల దోపిడీ దౌర్జన్యాలకు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ఉద్యమాల్లో పాల్గొన్నారని వెల్లడించారు. ఇది నిజాం నిరంకుశ పాలనకు దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్ర చెబుతున్న పచ్చి నిజం అని గుర్తు చేశారు. కానీ దీనిని మతోన్మాద పార్టీలు హిందూ లు ముస్లిం లకు వ్యతిరేకంగా సాగిన పోరాటమని అబద్ధపు ప్రచారాన్ని చేస్తున్నారని, ప్రజలందరూ వాస్తవ చరిత్రను తెలుసుకోవాలని తెలిపారు. కర్ణాటక మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 17 ను విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారనీ తక్షణమే తెలంగాణ ప్రభుత్వము అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి కే యం యు జాతీయ సమితి సభ్యులు అక్కపెల్లి బాపు, జిల్లా సమితి సభ్యులు బొంతుల లక్ష్మీనారాయణ, గుండా చంద్రమాణిక్యం, మేకల రాజేశం, రత్నం రాజం, వనం సత్యనారాయణ, నాయకులు దాసరి తిరుపతి గౌడ్, బియ్యాల ఉపేందర్, స్వామి దాస్, కామెర దుర్గయ్య, బండారి శంకర్, ఉప్పుల శంకర్ ,మహేందర్ రెడ్డి, కే తిరుపతి, రమణ ప్రజానాట్యమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తి భావం, శాంతియుత వాతావరణంలో వినాయక చవితిని జరుపుకోవాలి

- **జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా :** విఘ్నేశ్వరుని ఆశీస్సులతో నగర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా వరంగల్ మహా నగర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, మీడియా ప్రతినిధులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రసాయనిక రంగులు, పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలను నివారించి మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని సూచించారు. పండుగ వేడుకలను పరస్పర సహకారంతో, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా నిర్వహించి నగరంలో సోదరభావం, ఐక్యతను చాటాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

# భక్తితో మట్టి గణపతి.. బాధ్యతతో పర్యావరణ పరిరక్షణ

- **ప్రకృతిని మనం కాపాడితే.. ప్రకృతి మనల్ని కాపాడుతుంది.**
- **17వ ఏడాది అభినవ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ**




**బెల్లంపల్లి, మహా:** పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావిస్తూ.. పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రోత్సహించాలనే సంకల్పంతో అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ 17 వ ఏడాది కూడా తన సేవా కార్యక్రమాన్ని కొనసాగించింది. తాండూర్ మండల కేంద్రంలోని ఐబి సెంటర్‌లో ఆదివారం అభినవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కేశెట్టి సంతోష్ కుమార్ (అభినవ) ఆధ్వర్యంలో మట్టి గణపతులు, మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, తాండూర్ ఎస్సై ప్రసాదరావు,మాదారం ఎస్సై సౌజన్య ముఖ్యఅతిథులుగా హాజరై మట్టి గణపతి విగ్రహాలు, మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఒక సందేశం ఇవ్వాల్సిన సందర్భమన్నారు. మట్టి గణపతిని ప్రతిష్ఠించడం అంటే సంప్రదాxయాన్నికాపాడటమే కాకుండా ప్రకృతిని కాపాడటమని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయన, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను వినియోగించాలని ప్రజలకు సూచించారు. “ప్రకృతిని మనం కాపాడితే.. ప్రకృతి మనల్ని కాపాడుతుంది” అని పేర్కొంటూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.గత 17 సంవత్సరాలుగా నిరంతరంగా మట్టి గణపతులు, మొక్కల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో పర్యావరణ చైతన్యం కల్పిస్తున్న అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులను అభినందించారు. సేవా కార్యక్రమాన్ని ఒకటి రెండు సంవత్సరాలకు పరిమితం చేయకుండా ఇన్నేళ్లుగా కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఒక మట్టి గణపతి.. ఒక మొక్క.. భక్తితో పాటు ప్రకృతికి మనం అందించే కానుక అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు.....రెండు రోజుల్లో 1,267 మట్టి గణపతులు...అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 666 మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. వినాయక చవితి పండుగ రోజైన సోమవారం మరో 601 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో రెండు రోజుల్లో మొత్తం 1,267 పర్యావరణ హిత మట్టి గణపతి విగ్రహాలను ప్రజలకు అందించనున్నారు.ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రణపాల మొక్కలను కూడా పంపిణీ చేశారు. మట్టి గణపతిని ఇంటికి తీసుకెళ్లే ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి సంరక్షించాలనే సందేశాన్ని సంబంధిత కార్యక్రమం ద్వారా అందించారు.....17 ఏళ్లుగా పర్యావరణ సేవ...ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. అభినవ సంతోష్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో గత 17 సంవత్సరాలుగా దాతల సహాయ సహకారాలతో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్క సంస్థ బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.వినాయక చవితి సందర్భంగా భక్తితో గణపతిని పూజించడంతో పాటు ప్రకృతిని కూడా కాపాడాలనే ఆలోచన ప్రజల్లో పెంపొందించడమే తమ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతి, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే నేటి నుంచే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అడుగు వేయాలని పిలుపునిచ్చారు.17 ఏళ్లుగా కార్యక్రమానికి అండగా నిలుస్తున్న దాతలు, శ్రేయోభిలాషులు, వాసవి వనిత సభ్యులు, అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, స్థానిక ప్రజలకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.“భక్తి మన సంప్రదాయం.. మట్టి గణపతి మన బాధ్యత.. మొక్క మన భవిష్యత్తు” అనే సందేశంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని డా. అభినవ సంతోష్‌కుమార్ తెలిపారు.కార్యక్రమంలో వాసవి వనిత సభ్యులు కేశెట్టి సువర్ణ , మైలారపు అక్షయ , కాసం సునీత , బోనగిరి హేమలత , గందె శ్రీ విజయలక్ష్మి , తణుకు శంకరమ్మ ,కోడిప్యాక మాధురి , తనకు సువర్ణ , జైన పద్మ , సామ కల్పన , గంజి శ్రీ రాధిక , బోనగిరి స్పందన అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సామ రమేష్ , మైలారపు మధుసూదన్ , గాదె కుమార్ , చంద్రశేఖర్ , సురేష్ , సంతోష్, మహేష్,నవీన్ ,రాజన్న ,సోషల్ వర్కర్ హబీబ్ దాతలు, శ్రేయోభిలాషులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెల్లడి**

**బెల్లంపల్లి ,మహా :** పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే వినాయక చవితి ఉత్సవాలలో విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు. ఆదివారం రోజు జనహిత సేవాసమితి ఆధ్వర్యంలో దాతలు, సభ్యుల సహకారంతో బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో నిర్వహించిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి హాజరై భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (POP) విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, వాటికి బదులుగా పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు జనహిత సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయకవిగ్రహాలను పంపిణీ చేయడం శుభపరిణామం అని,ప్రతి కుటుంబం మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి, పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని,భక్తి, సాంప్రదాయాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారుఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామ్ చందర్, ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, జనహిత సేవా సమితి సభ్యులు, దాతలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంతా వైరల్ ఫీవర్

- పర్యావరణ మార్పులతో విజృంభిస్తున్న విష జ్వరాలు
- గొంతు నొప్పి, జలుబు,దగ్గుతో మొదలు 5 రోజులు వదలని జ్వరం
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో టెస్టుల మోతకు రోగులు విలవిల
- ప్రైవేటు ఆసుపత్రులకు కాసుల వర్షం

**వరంగల్, హెల్త్ మహా ;** గ్రేటర్ వరంగల్ లో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒక్కటే మాట జ్వరం వచ్చింది అన్నా. గల్లీ గల్లీలో, ఇంటింటా వైరల్ ఫీవర్ వణికిస్తోంది. వాతావరణంలో వస్తున్న అకస్మాత్తు మార్పులతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఉదయం ఎండ, సాయంత్రం చిరుజల్లు, రాత్రి చలి.. ఈ మార్పులను తట్టుకోలేక చిన్నా పెద్దా అందరూ జ్వరాల బారిన పడుతున్నారు. కుటుంబంలో ఒకరికి జ్వరం వస్తే చాలు కుటుంబం మొత్తం వైరల్ ఫీవర్ కు బలవుతున్నారు

**జ్వరం తీరు ఎలా ఉంది?**

మొదట గొంతు నొప్పి, ముక్కు కారడం, పొడి దగ్గుతో మొదలవుతోంది.తర్వాత ఒక్కసారిగా 102103 డిగ్రీల జ్వరం. ఒళ్లు నొప్పులు, తలనొప్పి, బ్లెడ్ ప్లేట్లు తగ్గిపోవడం నీరసంతో 45 రోజుల వరకు మంచం దిగనివ్వడం లేదని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఎఫెక్ట్ అవుతున్నారు. వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రి తో పాటు కాజీపేట, వరంగల్ , హనుమకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత వారం రోజులుగా ఓపీ 3 రెట్లు పెరిగింది. రోజుకు వందకు పైగా మందికి పైగా జ్వరంతో వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.టెస్టుల పేరుతో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ

జ్వరం వచ్చి ప్రైవేటు ఆసుపత్రికి వెళితే చాలు, జేబుకు చిల్లు పడుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.జలుబు జ్వరానికి కూడా సి బి సి, సిఆర్పి , డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, కోవిడ్, చివరకు చెస్ట్ ఎక్స్రే అంటూ ఒకేసారి 610 టెస్టులు రాసేస్తున్నారు. ఒక్కో టెస్టుకు రూ. 500 నుంచి రూ. 2000 వరకు వసూలు చేస్తున్నారు. ఆసుపత్రులను బట్టి టెస్టులకే సుమారు రూ. 5 వేలు నుంచి రూ. 8 వేలు అవుతోందని బాధితులు వాపోతున్నారు.ఎంజీఎం లో చికిత్స మాట దేవుడెరుగు ముఖ్యమైన మందులు దొరకడం లేదు, ప్రైవేటులో అయితే లక్షల్లో బిల్లు వేస్తున్నారని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

**కారణం ఏంటి?**

రోడ్ల పై నీరు నిలవడం, నాలాలో, డ్రైనేజీ లలో మురుగు పేరుకుపోవడం, తద్వారా దోమల బెడద పెరగడంసీజన్ మార్పుతో వైరస్ లు యాక్టివ్ కావడం అత్యంత కీలకమైనవి అని ఎందుకు తగ్గట్టుగా నగరంలో జిడబ్ల్యుఎంసీ శానిటేషన్ పారిశుద్ధ్యం సరిగా లేకపోవడం వల్ల కొత్త కొత్త రోగాలు తో పాటు విష జ్వరాలు ప్రభలు తున్నాయి. ప్రజలు ఏం చేయాలి? వైద్యుల సూచనలుముఖ్యంగా జ్వరం వస్తే సొంతంగా మందులు వాడకండి, దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందడం మంచిది. ఇంట్లో వేడి నీళ్లు, తులసి కషాయం తాగడం వల్ల ఇమ్యూనిటీ పెరిగి రోగాలు రాకుండా మనల్ని మనం రక్షించుకోవాలని ఇంటి చుట్టూ నీరు నిల్వనీయకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా పిల్లలకు, వృద్ధులకు చలి తగలకుండా చూడాలి. విష జ్వరాలు రాకుండా జిల్లా వైద్యాధికారి వెంటనే స్పందించి ప్రతి బస్తీలో ఫీవర్ సర్వే, దోమల మందు పిచికారీ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



# బీజేఆర్ నగర్ గౌడ సంఘానికి నూతన కమిటీ

**అధ్యక్షుడిగా దుబ్బాక రవీందర్ గౌడ్ ఎన్నిక**

**జవహర్‌నగర్, మహా:** బీజేఆర్ నగర్‌తో పాటు పరిసర కాలనీలకు చెందిన గౌడ కులస్తులు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా దుబ్బాక రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా మెరుగు బిక్షపతి, తండా ప్రభాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండకింద భరత్ గౌడ్, కోశాధికారిగా దంతూరి శివకుమార్ గౌడ్, సహాయ కార్యదర్శిగా దుబ్బాక నవీన్ గౌడ్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా వడ్లకొండ వెంకటేశ్వర్లు, మొక్తల శంకరయ్య గౌడ్, పుట్ట బిక్షపతి గౌడ్, కార్యవర్గ సభ్యులుగా బి.ఈశ్వర్ గౌడ్, బి.కృష్ణ గౌడ్, ఎన్.వెంకన్న గౌడ్, దంతూరి రజినీకుమార్ గౌడ్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దుబ్బాక రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘంలోని సభ్యులందరి అభిప్రాయాలను తీసుకుంటూ, అందరినీ కలుపుకొని సంఘాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని అన్నారు. అధ్యక్ష పదవిని బాధ్యతగా స్వీకరించి సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# ఆదిభట్ల విద్యుత్ లైన్మెన్ కృష్ణపై పోలీసులకు ఫిర్యాదు!

- అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- గతంలోనూ అదే మీటరు ఎత్తుకెళ్లాడని ఆరోపణ!




**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 13 మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగులూరు ఇందిరమ్మ కాలనీలో, లైన్మెన్ కృష్ణ, తమ ఇంటి విద్యుత్ మీటర్ దొంగతనం చేశారంటూ ఆరోపిస్తూ, పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ. ఆదిభట్ల విద్యుత్ లైన్మెన్ కృష్ణ మరో ఇద్దరు ఆంధ్రప్రభ రిపోర్టర్ లక్ష్మయ్య, ఐ న్యూస్ రిపోర్టర్ అంజిలతో కలిసి, సదరు మహిళ యొక్క ఇంట్లో ఎవరు లేని సమయం చూసి, ప్రహరీ గేటుకు తాళం వేసి ఉన్నా అక్రమంగా గోడ దూకి విద్యుత్ మీటర్ దొంగతనం చేశారంటూ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో ఇలాగే లైన్మెన్ కృష్ణ, ఈ యొక్క మహిళ ఇంటికి అమర్చిన విద్యుత్ మీటరును ఎత్తుకెళ్లడంతో, అతని పై అధికారులైన విద్యుత్ ఏడి ఏఈలకు ఫిర్యాదు చేయగా, ఆ యొక్క విద్యుత్ మీటరును, మళ్లీ యధా స్థానంలో ఆ ఇంటి గోడకు అమర్చడం జరిగింది. మళ్లీ విద్యుత్ మీటర్ ఎత్తుకెళ్లిన, లైన్మెన్ కృష్ణ మరో ఇద్దరి జర్నలిస్టులతో కలిసి కుమ్మక్కై ఇలాంటి దుర్మార్గానికి వడికట్టాడని, సదరు మహిళా ఇంటిని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ మీటర్ వెతికెళ్ళిన వారిపై చట్టపరిమైన చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన మహిళలకు, పోలీసులు దర్యాప్తు చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ఆమె తెలిపారు.

# ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే



**కుషాయిగూడ, మహా:** మండే మార్కెట్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. కల్యాణోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గుడి మధుసూదన్‌రెడ్డిని అభినందించారు.ఆటో యూనియన్ అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఈరెల్లి రవీందర్‌రెడ్డి, శనిగరం తిరుమలేష్, జట్ట కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి, సుక్క కిరణ్‌తో పాటు ఆటో యూనియన్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తీరని బిఎల్ఓల వెతలు

**అధిక పనిభారం తో ఒత్తిడి.**
**ఆరునెల్లగా అందని వేతనాలు.**



**దమ్మపేట ,మహా :** ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్లు-చిరునామాల పరిశీలన వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తున్న బి ఎల్ ఓ లు (బూత్ లెవల్ ఆఫీసర్లు) ప్రస్తుతం పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగ విధులను ప్రక్కనపెట్టి , ప్రభుత్వానికి అవసరమైన ఓటర్ల జాబితా ప్రక్రియ కొరకు అవిశ్రాంతంగా పనిచేస్తున్న క్రమంలో వారి గురించి పట్టించుకునే నాధుడే లేరని మండలంలోని కొందరు బి ఎల్ ఓలు ఆరోపిస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించడం, పత్రాలను పరిశీలించడం, మార్పులు-చేర్పులను నమోదు చేయడం వంటి పనులతో పాటు నిర్దేశించిన గడువులో డేటాను పూర్తి చేయాల్సిన పనులను ఎప్పటికప్పుడు చేస్తున్న ప్పటికి ఏదో పొరబాటు దొర్లిందంటూ చేసిన పనులనే మళ్ళీ మళ్ళీ చేయిస్తున్నారంటూ కొందరు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో వారికి అవసరమైన కనీస అవసరాలైన త్రాగునీరు ,లేదా భోజన సదుపాయాలు ,టీ వంటి సౌకర్యాలు లేక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామంటూ ఆదివారం మండలంలోని పలువురు బిఎల్ ఓలు తమ భాదను వ్యక్తం చేశారు. మరోవైపు, ప్రజలకు సరైన సమాచారం అందించడం, ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడం కూడా బిఎల్ ఓ ల బాధ్యతల్లో భాగంగా ఉంది. దీంతో సిబ్బంది కొరత, అధిక ఓటర్ల సంఖ్య, ఫీల్డ్‌లో సమయాభావం, సాంకేతిక సమస్యలు వంటి అంశాలు వారి పనిని మరింత క్లిష్టతరం చేస్తున్నాయని సిబ్బంది వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఎన్నికల ప్రక్రియలో బి ఎల్ ఓ లు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, వారికి తగిన సిబ్బంది సహాయం, సాంకేతిక సౌకర్యాలు, పనికి అనుగుణమైన సమయం కల్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**ఆరునెల్లగా లేని వేతనాలు :**

ఉద్యోగ ధర్మంతో పాటుగా ,అధనపు పనిభారం మోపుతున్నారే తప్ప గడిచిన ఆరు నెలలుగా జీతభత్యాలు అందడం లేదని , పెరిగిన నిత్యవసరాలను దృష్టిలో ఉంచుకొని రోజువారీ జీవనాన్ని గడపలేకపోతున్నామని ఆవేధన చెందారు. అంతేకాదు , ఏదేని అధికారులు చెకింగ్ పేరుతో అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చినప్పుడు సరైన ఉద్యోగ నిర్వహణ లేదంటూ కొందరి బిఎల్ఓ లపై అధికార జులుం ప్రవర్తిస్తున్నారని , పండుగ లు ,సెలవు దినాలనే తేడాలు లేకుండా ప్రతిరోజూ ఏదోఒక ప్రభుత్వ కార్యక్రమానికి బిఎల్ ఓ లను నియమిస్తూ , పనిభారం పెంచుతున్నారని కన్నీటి పర్యాంతమయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమరికి రావాల్సిన ఆరునెలల జీతభత్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని ,పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



# మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

**దమ్మపేట, సెప్టెంబర్ 13 ,మహా :** మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు కోరారు. వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైస్ సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావుతో కలిసి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పీఓపీ విగ్రహాలతో పోలిస్తే మట్టి విగ్రహాలు నీటిలో సహజంగా కరిగిపోతాయని, రసాయన రంగులు లేకపోవడంతో జలచరాలకు హాని ఉండదని తెలిపారు. ఇంట్లోనే బకెట్ లో నిమజ్జనం చేసి, కరిగిన మట్టిని మొక్కలకు వినియోగించవచ్చన్నారు. మట్టి విగ్రహాల వినియోగంతో స్థానిక కుమ్మరులు, కళాకారులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని చెప్పారు. పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



# ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం

**కాప్రా డివిజన్‌లో రూ.1.13 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**కుషాయిగూడ, మహా:** నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. కాప్రా డివిజన్ పరిధిలో రూ.1.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మనోజ్ ఎన్‌క్లేవ్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.18 లక్షలు, డబా గార్డెన్స్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.30 లక్షలు, గురు రాఘవేంద్ర కాలనీలో రోడ్డు పనులకు రూ.35 లక్షలు, పద్మారావునగర్ కాలనీలో రోడ్డు పనులకు రూ.30 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల్లో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు స్థానికంగా ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనులు ప్రారంభం కావడంతో ఆయా కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.




# కాప్రా చెరువులో వినాయక నిమజ్జనానికి ఆహ్వానం

**కుషాయిగూడ, మహా:** కాప్రా చెరువులో 11 రోజుల అనంతరం నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ భాగ్యనగర్ ఉత్సవ సమితి ఏఎస్‌రావునగర్ డివిజన్ కన్వీనర్ సీహెచ్ సోమేశ్‌నాయుడు ఆదివారం పలువురు ప్రముఖులను కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కుషాయిగూడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ లెంకల భాస్కర్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు.భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు సోమేశ్‌నాయుడు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ సమితి తరపున స్వచ్ఛందంగా సేవలు అందిస్తామని చెప్పారు. 2026 వినాయక నిమజ్జనానికి సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని, ఉత్సవ సమితి సభ్యులు స్వచ్ఛంద సేవకులుగా పనిచేస్తారని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, కుషాయిగూడ సీఐ భాస్కర్‌రెడ్డిని కలిసిన వారిలో ఉత్సవ సమితి సభ్యులు సందీప్‌చారి, దేవా, బొంతుల ప్రభాకర్, వంశీ, సంతోష్, లోకేష్, సౌమిత్ర, లక్ష్మి, రత్న తదితరులు ఉన్నారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**రాజేంద్రనగర్ మహా ;** 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి అసెంబ్లీలో తీర్మాణం ఆమోదం పొందిన సందర్భంగా ఆదివారం శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి, భట్టి విక్రమార్కా, మంత్రి సీతక్క, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లకు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు కోటేశ్వర్ గౌడ్, పార్టీ అధ్యక్షులు మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ 2018 గ్రామపంచాయతీ చట్టాన్ని సవరించడంతో గ్రామపంచాయతీ లకు ఎంతగానో ఉపయోగపడుతుంది. బిఆర్ఎస్ ప్రభుత్వంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ చట్ట సవరణ తరువాత గ్రామ పంచాయతీలకు మహర్దశా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్మాజీ జడ్పీటీసీ నీరటి తన్విరాజు ముదిరాజ్, సర్పంచులు రవినాయక్, ప్రభాకర్ గౌడ్, బుజ్జి గోపాల్, మౌనిక ఆంజనేయులు, సత్యనారాయణ గౌడ్, మల్చలం లింగం,దవేందర్, ఊప సర్పంచులు కుమార్, శ్రీనివాస్,నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బాలు ముదిరాజ్, రఫీక్ భాయ్,సలీం,ప్రభాకర్ యాదవ్, అంజయ్య యాదవ్, యాదగిరి, సుమన్, గణేష్‌నాయక్, గౌస్, ఇంద్రారెడ్డి, మనోజ్, అజయ్, గోపాల్, ఆంజనేయులు గోనెల, కపిల్, చంద్రశేఖర్, నీరటి జంగయ్య, సుకుమార్, ప్రవీణ్,, తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో వంద పడకల ఆసుపత్రి సాధించుకుందాం

- త్వరలో తెలుగుదేశం ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష
- టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్ కుమార్



**మందమర్రి, మహా :** మందమర్రిలో వంద పడకల ఆసుపత్రి సాధించుకుందామని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం మందమర్రి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందమర్రి మున్సిపాలిటీలో 40 వెల పైన జనాభా ఉన్నప్పటికీ 24 గంటల వైద్య సౌకర్యం కల్పించడంలో పాలకులు విఫలం అయ్యారని విమర్శించారు. ఇక్కడినుండే ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రి పదవులు చేపట్టిన ఆసుపత్రిని మంజూరు చేపించడంలో విఫలం అయ్యారని అన్నారు. ఇప్పటివరకు పాము కాటు వల్ల ఇప్పటికి ఎన్నో ప్రాణాలు పోయాయని ఆరోపించారు. కనీసం ఇక్కడ ఇంజక్షన్ కూడా లేని పరిస్థితి నెలకొందని వెల్లడించారు. మహిళల కోసం గైయాకలోజిస్ట్, వృద్ధుల కొరకు బొక్కల డాక్టర్, కంటి డాక్టర్లు అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాత్రి పూట అత్యవసర సర్వీసెస్ ల కొరకు నిపుణులైన వైద్యులను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని చెప్పారు.ఇక్కడ నివసించే యువకులకు ఉద్యోగాలు లేక రోగులు ప్రైవేట్ ఆసుపత్రి కి వెళ్లలేక చాలా మంది ప్రాణాలు హరించకపోతున్నాయని ఆరోపించారు. కేవలం ఇక్కడి ప్రజల ఓట్ల కొరకు ఆకర్షణీయమైన హామీలు ఇస్తూ ఓట్లను వివిధ పార్టీల నేతలు దండుకుంటున్నారని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఉద్దేశంతో తాను త్వరలో ఆమరణ నిరాహార దీక్ష చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్ కారంరాజు పట్టణ ప్రధాన కార్యదర్శి, మహిళ అధ్యక్షులు సంధ్య జుపాక, వోడ్నాల సత్యనారాయణ, మహిళమండల అధ్యక్షులు సుగుణ, సమాకవిత, జయశ్రీ,పొలంపల్లి శ్రీనివాస్ కొడివారి కవిత తదితరులు పాల్గొన్నారు.

# కారు కొనుగోలు పేరుతో పిలిచి పిస్టల్‌తో బెదిరించి దోపిడీ




**కుషాయిగూడ, మహా :** కారు కొనుగోలు చేస్తామని నమ్మించి బాధితులను ఫార్మ్‌హౌస్‌కు రప్పించి పిస్టల్, కత్తితో బెదిరించి నగదు, ఐఫోన్, ఖరీదైన చేతి గడియారాలు, మెర్సిడెస్ బెంజ్ కారును అపహరించిన ఐదుగురు నిందితులను కీసర పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో ఎయిర్ పిస్టల్, కత్తి, ఐఫోన్, టిస్సాట్, కాసియో చేతి గడియారాలతో పాటు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 923/2026 కేసు దర్యాప్తులో నిందితులు చెప్యాల విద్యాప్రకాష్‌రెడ్డి @ విద్య (A1), అబ్రబోయిన దీక్షిత్ (A2), ధరావత్ రాహుల్ (A3), అన్నభీమోజు సాయి వినీత్ (A4), కొమ్మెరి రాకేష్ (A5)గా గుర్తించారు. బాధితుడు మొహమ్మద్ ఇబ్రహీం అలీకి చెందిన ఏపీ 16 బీజెడ్ 2222 నంబరు గల మెర్సిడెస్ బెంజ్ కారును కొనుగోలు చేస్తామని నమ్మించి ఆగస్టు 30న అతడిని స్నేహితుడు మొహమ్మద్ రఫే హష్మీతో కలిసి హోలీ మేరీ కళాశాల సమీపంలోని ఫార్మ్‌హౌస్‌కు రప్పించారు. అక్కడ ఐదుగురు నిందితులు పిస్టల్, కత్తితో బెదిరించి, ఇనుప రాడ్, ట్యూబ్‌లైట్, కర్రతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాధితుల వద్ద ఉన్న నగదు, ఐఫోన్, బంగారు గొలుసు, టిస్సాట్, కాసియో చేతి గడియారాలు, మెర్సిడెస్ బెంజ్ కారును బలవంతంగా తీసుకెళ్లారు. బాధితులను తమ వాహనంలో ఎక్కించుకుని నాగారం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద అర్ధరాత్రి సమయంలో వదిలేశారు.ఇదిలా ఉండగా సెప్టెంబరు 11న రాత్రి ఏ1 బాధితుడికి ఫోన్ చేసి, అతడి మొబైల్‌లో ఉన్న వ్యక్తిగత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి రూ.1.50 లక్షలు డిమాండ్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఐదుగురి అరెస్టుదర్యాప్తులో భాగంగా ఈ నెల 13న బోగారం క్రాస్‌రోడ్స్ వద్ద ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరంలో తమ పాత్రలను వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. వారి సమాచారంతో నేరానికి ఉపయోగించిన ఆయుధాలు, మొబైల్‌ఫోన్, చేతి గడియారాలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

వాహనాల కొనుగోలు, విక్రయాల సమయంలో పరిచయం లేని వ్యక్తులను పూర్తిగా నమ్మవద్దని కీసర పోలీసులు సూచించారు. వాహనం యాజమాన్య వివరాలు, పత్రాలు, లావాదేవీలను పూర్తిగా ధ్రువీకరించుకోవాలని తెలిపారు. కొనుగోలు, విక్రయాల పేరుతో నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లవద్దని, ఆయుధాలతో బెదిరింపులు లేదా వ్యక్తిగత ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.కేసు దర్యాప్తును జవహర్‌నగర్ ఏసీపీ ఎస్.చక్రపాణి పర్యవేక్షణలో కీసర ఇన్‌స్పెక్టర్ ఎ.ఆంజనేయులు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్, ఎస్ఐలు బి.నాగరాజు, వి.వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్, సిబ్బంది సహకారంతో చేపట్టారు. నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి, ఆయుధాలు, దోపిడీకి గురైన ఆస్తిలో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.



# లక్ష్యంతో చదివితేనే ఉజ్వల భవిష్యత్..

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి..
- శ్రీవిద్య–కృష్ణవేణి విద్యా సంస్థల ఫ్రెషర్స్ డేలో పీ శంకర్

**మణుగూరు, మహా** : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని శ్రీవిద్య-కృష్ణవేణి విద్యా సంస్థల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్ పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. స్థానిక స్నేహ గార్డెన్స్‌లో ఆదివారం శ్రీవిద్య-కృష్ణవేణి విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుచ్చకాయల శంకర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. మంచి మార్కులు సాధించడమే కాకుండా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగేలా లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్న తీరుపై పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను ప్రసంగాల ద్వారా పంచుకున్నారు. కార్యక్రమంలో శ్రీవిద్య-కృష్ణవేణి విద్యా సంస్థల కరస్పాండెంట్లు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, పుచ్చకాయల శంకర్, అకాడమిక్ డైరెక్టర్ సారంగపాణి, ప్రిన్సిపాల్ పి నాగేశ్వరరావుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో అల్లర్లకు తావులేదు!

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు
- పాత నేరస్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా: ఎస్సై గట్ల సుధాకర్

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు, గొడవలు లేదా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శ్రీరాంపూర్ ఎస్సై గట్ల సుధాకర్ హెచ్చరించారు.గణేష్ ఉత్సవాల నేపథ్యంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా పాత నేరస్తులు, రౌడీ షీటర్లకు ముందస్తుగా ప్రత్యేకమైన కౌన్సిలింగ్ నిర్వహించారు కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, వారి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించేది లేదు అని ఎస్సై స్పష్టం చేశారు. ఉత్సవాల పేరుతో గొడవలకు దిగడం, అల్లర్లు సృష్టించడం, ఇతరులకు ఇబ్బంది కలిగించడం, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడటం వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించుకోవాలని, ఇతరులకు అసౌకర్యం కలిగించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మండల ప్రజలు సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలు ఆనందోత్సాహాలతో, ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.




# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి..

**అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం**

**కరీంనగర్ మహా:** ఎస్ ఐ ఆర్ ప్రక్రియను అధికారులు సిబ్బంది పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఒక్క అనర్హుడికి చోటు లేకుండా.. ఒక్క అర్హుడి పేరు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాను దోషరహితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (SIR2026) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలనలో ఏమాత్రం పొరపాట్లకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు, అన్‌మ్యాప్డ్ ఓట్లు, ఇతర మార్పులకు సంబంధించి సంబంధిత ఓటర్లకు అవసరమైన నోటీసులను వెంటనే అందజేయాలని BLOలను ఆదేశించారు. నోటీసుల అనంతరం చేపట్టే క్షేత్రస్థాయి విచారణలను పారదర్శకంగా నిర్వహించి, సంబంధిత నివేదికలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. జిల్లాలో రెండు లక్షల 70 వేల మందికి దరఖాస్తులు అందించాల్సి ఉండగారు 2,24,263 మంది ఓటర్లకు నోటీసులు అందించామని తెలిపారు.. దాదాపు లక్ష మంది వరకు నోటీసులకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును నిర్ధారించుకునేందుకు ఎన్నికల సంఘం గమనిక లో సూచించిన గుర్తింపు కార్డులను అధికారులకు సమర్పించాలన్నారు.

**దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు**

కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం6, ఓటర్ల జాబితాలో పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం7, పేరు, చిరునామా తదితర వివరాల మార్పులు, సవరణలకు ఫారం8 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించి, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులు, అభ్యర్థనలు, సవరణలకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు.

**BLOల పనిపై క్రాస్ వెరిఫికేషన్**

BLO సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ BLOలు నిర్వహించిన పనులను క్రాస్ వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలన, అన్‌మ్యాప్డ్ ఓట్ల గుర్తింపు, నోటీసుల జారీ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి ఓటరూ జాబితాను పరిశీలించుకోవాలి ఓటర్ల జాబితా సవరణలో అధికారుల పాత్రతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతతో పాటు ప్రతి ఓటరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కోరారు. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే వెంటనే ఎన్నికల సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం6, పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం7, వివరాల మార్పులు, సవరణలకు ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులను సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండటం.. అనర్హుల పేర్లు తొలగించడం.. నమోదైన వివరాల్లో తప్పులు లేకుండా చూడటమే SIR ప్రక్రియ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే దోషరహిత, పారదర్శక ఓటర్ల జాబితా సాధ్యమవుతుందని, అందుకు ఓటర్లు కూడా తమ వివరాలను పరిశీలించుకుని సహకరించాలని కోరారు. SIR ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇదే స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ వెల్లడించారు.

# పంచాయతీల సొంత ఆదాయంపై స్వేచ్ఛ హర్షణీయం..

- పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 70(3) సవరణపై సర్పంచ్‌ల హర్షం
- ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



**మణుగూరు, మహా :** గ్రామ పంచాయతీలకు వచ్చే సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా ఆయా పంచాయతీల ఖాతాల్లోనే జమ చేసుకొని, స్థానిక అవసరాలు, అభివృద్ధి పనులకు తీర్మానం ద్వారా ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018లోని సెక్షన్ 70(3)కు సవరణ చేయడంపై మణుగూరు మండల సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మణుగూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్ అధ్యక్షతన సర్పంచ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని స్థానిక అవసరాలకు వినియోగించుకునే అవకాశం కల్పించడం గ్రామీణాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. సెక్షన్ 70(3) సవరణకు శాసనసభ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు, గ్రామ పంచాయతీలకు మేలు చేసే నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితిసింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, కూనవరం సర్పంచ్ ఎనిక శ్వేత, విప్పాలసింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, లంకమల్లారం సర్పంచ్ పూనెం రమేష్, తొగ్గూడెం సర్పంచ్ మడకం రామకృష్ణ, గుట్టమల్లారం సర్పంచ్ కారం పూజిత, బుగ్గ సర్పంచ్ శెట్టిపల్లి మాధవి, కట్టుమల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

# పోరాటాలతోనే సింగరేణి కార్మికుల హక్కుల సాధన..

- 24 డిమాండ్లపై ఒప్పందం కార్మికుల విజయం
- సింగరేణి పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తాం
- ఏఐటీయూసీ నేతలు



**మణుగూరు, మహా** : పోరాటాల ద్వారానే సింగరేణి కార్మికుల హక్కుల సాధన సాధ్యమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఇచ్చిన సమ్మె నోటీసు నేపథ్యంలో రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో యాజమాన్యంతో 24 డిమాండ్లపై ఆగస్టు 27న కుదిరిన ఒప్పందం కార్మికుల విజయమని పేర్కొన్నారు. మణుగూరు పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం సాయంత్రం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మణుగూరు బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 13 ఏళ్లుగా కార్మికులు ఎదురుచూస్తున్న పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే చెల్లించేందుకు అంగీకరించడం ఒప్పందంలో కీలక అంశమన్నారు. సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షలు చెల్లించడం, ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించడం, సకాలంలో సేఫ్టీ మెటీరియల్ అందించడం, డిస్మిస్ అయిన కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై అంగీకారం కుదిరిందన్నారు. మైనింగ్, టెక్నికల్ సిబ్బంది వైద్యపరంగా అన్‌ఫిట్ అయితే వారికి సర్ఫేస్‌లో అనుకూలమైన ఉద్యోగం కల్పించడం, 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటాను దసరా పండుగలోపు చెల్లించడం, మెడికల్ అటెండెన్స్ రూల్స్‌లో మార్పులు, సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించడం తదితర అంశాలు ఒప్పందంలో ఉన్నాయని వివరించారు. జనరల్ స్ట్రైక్‌లో పాల్గొనే కాంట్రాక్ట్ కార్మికులపై 'నో వర్క్ నో వేజెస్'కు అదనంగా పెనాల్టీ విధించకుండా చూడటం, కార్మికులకు సొంతింటి పథకం అమలుపై ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకోవడం సహా మొత్తం 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరిందన్నారు.

**- ఒప్పందాలపై చర్చకు సిద్ధం..**

ఏఐటీయూసీ సాధించిన ఒప్పందంపై టిబిజికెఎస్ నాయకులు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న విమర్శలను నేతలు తప్పుబట్టారు. గతంలో జరిగిన ఒప్పందాలు, ప్రస్తుతం ఏఐటీయూసీ సాధించిన ఒప్పందాలను ముందుంచి బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాల్ చేశారు. గుర్తింపు సంఘం కాలపరిమితిపై టిబిజికెఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదన్నారు. గతంలో టిబిజికెఎస్ గుర్తింపు సంఘంగా ఆరేళ్లకు పైగా కొనసాగిన విషయాన్ని గుర్తుచేశారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు గతంలో రూ.27 వేల కోట్లుగా ఉండగా ప్రస్తుతం రూ.56 వేల కోట్లకు చేరాయని పేర్కొంటూ, వాటిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తాడిచర్ల బ్లాక్2, పీకేఓసీ2 డీప్‌సైడ్ సింగరేణికి దక్కడంలో ఏఐటీయూసీ పోరాటం ఉందని, పూసపల్లి ఓసీపీ త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. కోయగూడెం ఓసీపీ3, సత్తుపల్లి ఓసీ3లను కూడా సింగరేణికి దక్కేలా పోరాటం చేస్తామని చెప్పారు. 12వ వేజ్‌బోర్డు ఏర్పాటు కోసం జాతీయ కార్మిక సంఘాలు చేసిన ఒత్తిడికి స్పందించిన కోల్ ఇండియా యాజమాన్యం ప్రభుత్వానికి లేఖ రాసేందుకు అంగీకరించిందన్నారు. వేజ్‌బోర్డు సాధనతో పాటు సింగరేణి కార్మికుల హక్కులు, సంస్థ పరిరక్షణ కోసం ఏఐటీయూసీ సహా జాతీయ సంఘాలు ఇచ్చే పిలుపు మేరకు కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్, ఉపాధ్యక్షుడు ఎం.వి. రామనసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పుల్లారావు, ఆఫీస్ బేరర్లు ఆవుల నాగరాజు, ఎ. సురేందర్, బి. సురేందర్‌రావు, ఎ. రాజశేఖర్, పిట్ సెక్రటరీలు జి. శ్రీనివాసరావు, బి. రవి, వి. సతీష్, ఆందోని రవికుమార్, సాయి ప్రకాష్‌చారి, గుండు శరత్‌కుమార్, ఎం. పద్మావతి, రత్నం శివకుమార్‌తో పాటు వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, ఎగ్జిక్యూటివ్, కౌన్సిల్ సభ్యులు, మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాలకు గట్టి భద్రత.. నేరాలపై ఉక్కుపాదం!

**కరీంనగర్, మహా:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెల నేర సమీక్షలో భాగంగా నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ మోసాలు, డ్రగ్స్, గుట్కా, పేకాట, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాలు, అత్యవసర ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలని, నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, విద్యుత్ వెలుగులు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక రూట్ మ్యాప్ అమలు చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలు జరిగిన వెంటనే శాస్త్రీయ ఆధారాలు సేకరించి దర్యాప్తు పూర్తి చేయాలని, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల కేసుల్లో సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ బాధితులకు త్వరితగతిన నగదు రికవరీ, CEIR ద్వారా పోయిన మొబైళ్ల రికవరీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సెప్టెంబర్ 12న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 4,268 కేసులు పరిష్కరించడంతో అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సీపీ అభినందించారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 5,261 కేసుల పరిష్కారం

**పెద్దపల్లి, మహా:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 5,261 కేసులు పరిష్కారమయ్యాయి. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన రాజీకి వీలైన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించారు. ఇందులో 613 ఐపీసీ కేసులు, ప్రత్యేక చట్టాలకు సంబంధించిన 36 కేసులు, 2,872 ఈచలాన్ కేసులు, 1,740 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉన్నాయి. సైబర్ నేరాలకు సంబంధించి 125 కేసుల్లో బాధితులకు రూ.33,65,739 తిరిగి అందించారు. వీటిలో రామగుండం పరిధిలోని 123 కేసులకు రూ.27,58,843, సీసీపీఎస్ రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు కేసులకు రూ.6,06,896 రికవరీ చేశారు.ఈ వివరాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. లోక్ అదాలత్ ద్వారా చిన్నపాటి నేరాలు, ట్రాఫిక్, ఎక్సైజ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు త్వరగా పరిష్కారమై ప్రజలకు సమయం, ధనం ఆదా అయ్యాయని తెలిపారు.

# గణేష్ ఉత్సవాలకు గట్టి కవచం!

- మండపం నుంచి నిమజ్జన ఘాట్ వరకు పోలీసుల నిఘా
- సీసీ కెమెరాలు.. భారీ బందోబస్తు.. ప్రత్యేక రూట్‌మ్యాప్
- వదంతులు, రెచ్చగొట్టే పోస్టులపై ఉక్కుపాదం
- ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి: సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్ మహా :** వినాయకుడి ఉత్సవం భక్తి పండుగ.. భద్రత పోలీసుల బాధ్యత! గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ సర్వసన్నద్ధమైంది. మండపాల వద్ద నిఘా నుంచి నిమజ్జన ఘాట్ల వద్ద భద్రత వరకు ప్రతి అంశాన్నీ పర్యవేక్షిస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రజల భక్తికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో శాంతిభద్రతలకు విఘాతం లేకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి మండపంపై నిఘా

ప్రతి గణేష్ మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీపీ సూచించారు. వాలంటీర్లు 24 గంటలూ మండపాల వద్ద అందుబాటులో ఉండి పోలీసులకు సహకరించాలని తెలిపారు. పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల అత్యవసర ఫోన్ నంబర్లను మండపాల వద్ద ప్రదర్శించాలని ఆదేశించారు.

**ఘాట్ల వద్ద భారీ భద్రత**

మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట తదితర ప్రధాన నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రమాదాలకు అవకాశం లేకుండా భారీ క్రేన్లు, నిరంతర విద్యుత్ దీపాలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు సీపీ తెలిపారు.

**కంట్రోల్ రూమ్ నుంచి నిఘా**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ద్వారా ముఖ్య కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలు, నిమజ్జన మార్గాలపై సీసీ కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగుతుంది. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకునేలా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

**ట్రాఫిక్‌కు ప్రత్యేక ప్రణాళిక**

గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు రూట్ మ్యాప్‌ను అమలు చేస్తున్నారు. ఊరేగింపు మార్గాల్లో అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లు, చెట్ల కొమ్మలను సంబంధిత శాఖల సమన్వయంతో తొలగించినట్లు సీపీ తెలిపారు.

**సోషల్ మీడియాపై నిఘా**

ఉత్సవాల సమయంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ గౌష్ ఆలం హెచ్చరించారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, పరస్పర సహకారంతో, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ విజయవంతంగా నిర్వహించాలని సీపీ గౌష్ ఆలం ప్రజలకు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

# ఆకలికి చెక్.. చదువుకు బూస్ట్!



**కరీంనగర్, మహా:** విద్యార్థులు ఆకలితో పాఠశాలలకు వెళ్లకుండా ఆరోగ్యకరమైన అల్పాహారం అందించేందుకు చేపట్టిన స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను కరీంనగర్‌లో మరింత విస్తరించనున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఈ నెల 16న ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా కార్యక్రమానికి అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఈ కిచెన్ ద్వారా కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ తదితర ప్రాంతాల్లోని 17 మండలాల పరిధిలో 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 49,025 మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించనున్నారు. పరిశుభ్రత, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ వంటశాలను సిద్ధం చేశారు. విద్యార్థులకు సమతుల్య పోషకాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (NIN) సూచనలతో ప్రత్యేక మెనూ రూపొందించారు. సోమవారం ఇడ్లీ-సాంబార్, మంగళవారం పూరి-ఆలూ కుర్మా, బుధవారం దోశ-చట్నీ, గురువారం ఉప్మా-చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ-సాంబార్, శనివారం బోండా-చట్నీ అందించనున్నారు. అదనంగా రోజు విడిచి రోజు పాలు ఇవ్వనున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రత, హాజరు మెరుగుపడటమే కార్యక్రమం లక్ష్యంగా అధికారులు పేర్కొంటున్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం .. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**మట్టి గణపతులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్**

**పెద్దపల్లి మహా, :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పెద్దపల్లి పట్టణ కేంద్రంలో ఆదివారం రోజున మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాలను నియోజకవర్గ ప్రజలకు అందజేసే కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయరమణరావు పాల్గొని భక్తులకు విగ్రహాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా మన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకోవడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కూడా దోహదపడుతుందని తెలిపారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అందుకే పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. “మట్టి గణపతిని పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుకుందాం” అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కోరారు. మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. భక్తులు, స్థానిక ప్రజలు మట్టి విగ్రహాలను స్వీకరించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సంకల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నేత రవీందర్ సేవలు చిరస్మరణీయం

- **సంతాప సభలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, వక్తలు**

**మందమర్రి, మహా :** దివంగత బీఆర్ఎస్ నేత జెంగిలి రవీందర్ సేవలు చిరస్మరణీయమని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బాల్క సుమన్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ అగ్రనేత కెంగర్ల మల్లయ్య లు అన్నారు. ఆదివారం మందమర్రి సింగరేణి కమ్యూనిటీ హాల్ లో బీఆర్ఎస్ పార్టీ మందమర్రి పట్టణ అధ్యక్షులు, తెలంగాణ ఉద్యమ నాయకులు స్వర్గీయ జెంగిలి రవీందర్ సంతాప సభ నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ సమయంలో రవీందర్ చేసిన సేవలు అమోఘమని అవి ఎప్పుడు మర్చిపోలేనివని అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న మృదు స్వభావి రవీందర్ మృతి చెందడం తమను ఎంతగానో కలిచి వేసిందని వివరించారు. తన లోటును ఇక్కడ తీర్చడం చాలా కష్టమని అన్నారు. అంతకు క్రితం స్వర్గీయ నేత రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అన్ని కుల సంఘాల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ట్రేడ్ యూనియన్ నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని రవీందర్ అన్న గారి సేవలను స్మరించుకున్నారు.

**కేటీఆర్ తరపున సంతాప సందేశం**

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) వారి కుటుంబ సభ్యులకు పంపిన సంతాప సందేశాన్ని అందించారు.తెలంగాణ ఉద్యమంలో, బీఆర్ఎస్ పార్టీ నిర్మాణంలో, సింగరేణి కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటంలో రవీందర్ అన్న చేసిన సేవలు చిరస్మరణీయం. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ఆయన ఇక మన మధ్య లేకపోవడం బీఆర్ఎస్ పార్టీకి, మందమర్రి ప్రజలకు తీరని లోటని కొనియాడారు. రవీందర్ అన్నతో నాకు ఉన్న అనుబంధం ఎప్పటికీ మరువలేనిది. ఆయన చూపిన ఉద్యమ స్ఫూర్తి, పార్టీ పట్ల ఉన్న నిబద్ధత మనందరికీ ఆదర్శమని అన్నారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ కష్టాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు వారి కుటుంబానికి ప్రసాదించాలని కోరుకుంటున్నానని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం పట్టణ ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 51వ డివిషన్ కార్పొరేటర్ కంభంపాటి దుర్గా ప్రసాద్, అధ్యక్షుడు కొదుమూరి సురేష్ బాబు ఆర్యవైశ్యలు అందరూ కలిసి పాల్గొని ఉచిత మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొదుమూరి సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి రేపాక మనోహర్, కోశాధికారి కూరా ప్రసాద్, గౌరవ అధ్యక్షులు దారా నాగేష్, గౌరవ అధ్యక్షులు పల్లపోతు శ్రీనివాస్(వాసు), పల్లపోతు శ్రీనివాస్(చిన్న వాసు), కంభంపాటి రమేష్, వల్లాల రమణ, శీమకుర్తి నాగరాజా తరుణ్, దారా కిరణ్, నరేంద్రుల రిషి, చెల్లా శేఖర్, చారుగుల్ల సుధాకర్, దోంతుల అరుణ్ కుమార్, ఉప్పల శ్రీనివాస్, వంగవీటి శ్రీకాంత, గరిని చిన్న, కోదుమూరు సత్యనారాయణ, వందనపు రవి కిషోర్, కొయ్యడ నాగేష్, గునీపాటి సుధాకర్, వారణాశి సురేష్, వెమిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణకు బాట

**తొమ్మిదేళ్లుగా అవగాహన కార్యక్రమం..**
**సత్తుపల్లిలో 2 వేల విగ్రహాల ఉచిత పంపిణీ**



**సత్తుపల్లి, సెప్టెంబర్ 13: మహా** పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ లక్ష్యంగా మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ మాధురి మధు చేపడుతున్న సేవా కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తోంది. గత తొమ్మిదేళ్లుగా వినాయక చవితి సందర్భంగా ప్రజలకు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణహిత పండుగ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం సత్తుపల్లిలో 2,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

**రసాయన విగ్రహాలకు స్వస్తి పలకాలి**

కార్యక్రమాన్ని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారయ్యే విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు, ఇతర నీటి వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు.

**తొమ్మిదేళ్లుగా నిరంతర సేవ**

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు వరుసగా తొమ్మిదేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న మాధురి మధును పలువురు అభినందించారు. పండుగ సంబరాలతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు, స్థానికులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై కార్ల పార్కింగ్..!

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అసలే ఇరుకు రహదారి.. ఆపై మధ్యలో డివైడర్.. దీనికితోడు రహదారి పక్కనే అడ్డదిడ్డంగా కార్ల పార్కింగ్.. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి సింగరేణి ప్రధాన కార్యాలయం మీదుగా విజయవాడకు వెళ్లే జాతీయ రహదారిని కొందరు పార్కింగ్ అడ్డాగా మార్చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సెయింట్ మేరీ హైస్కూల్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై తరచూ కార్లను నిలిపివేస్తున్నారు. సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగే శుభకార్యాలకు వచ్చేవారు రోడ్డుపక్కనే వాహనాలను గంటల తరబడి పార్కింగ్ చేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ద్విచక్ర వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. నంబర్ ప్లేట్ల ఫొటోలు తీసి చలాన్లు విధించే ట్రాఫిక్ సిబ్బందికి ఈ పార్కింగ్ వ్యవహారం కనిపించడం లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించడం వల్ల ప్రయోజనం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే జాతీయ రహదారిపై పార్కింగ్‌ను నియంత్రించి, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు ట్రాఫిక్ పోలీసులను డిమాండ్ చేస్తున్నారు.



# మళ్ళీ గెలుస్తా .. మంత్రినవుతా

- రాహుల్ పాదయాత్ర వల్లే గెలిచా
- రేవంతన్న మాస్ లీడర్ .. త్వరలో కొండా మురళికి పదవి
- కాంగ్రెస్ ను వీడే ప్రసక్తేలేదు
- కార్యకర్తల భేటీలో మాజీ మంత్రి కొండా సురేఖ



**వరంగల్, మహా:** తమపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని పార్టీ క్యాడర్‌తోపాటు అభిమానులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ స్పష్టం చేశారు. టీవీలో ప్రసారం అవుతున్నవి ఊహాత్మక కథనాలని.. అవి అబద్ధమని తెలిపారు. తాము ఏ పార్టీలోకి వెళ్లబోమని ప్రకటించారు. కాంగ్రెస్‌లో పుట్టామని.. ఆ పార్టీలోనే కొనసాగుతామని చెప్పారు. ఆదివారం వరంగల్‌లో అభిమానులు, కార్యకర్తల సమావేశంలో భర్త కొండా మురళితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. తనను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేశారని బాధపడలేదని అన్నారు. కానీ కారణం లేకుండా తొలగించారనే ఆవేదన మాత్రం తనకు ఉందని తెలిపారు. ఇకపై మళ్లీ ప్రజల్లోనే ఉంటామని కొండా సురేఖ ప్రకటించారు. అవినీతి చేయకుండా మంత్రిత్వ శాఖ నిర్వహించానని ఈ సందర్భంగా వివరించారు. ఎంపీపీ నుంచి మంత్రి స్థాయికి తాను ఎదిగానని గుర్తు చేసుకున్నారు. పదవి అనేది అలంకారం మాత్రమేనని పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని అన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తే తాను గెలిచానని చెప్పారు. మళ్లీ కాంగ్రెస్ నుంచే పోటీచేసి గెలుస్తానని కొండా సురేఖ ధీమా వ్యక్తం చేశారు.

**కొండా మురళికి త్వరలో పదవి**

వరంగల్ తూర్పు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి నూటికి నూరు శాతం కొండా సురేఖ గెలుస్తుందని.. మళ్లీ తాను మంత్రి పదవి చేపడతానని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే తనను బర్తరఫ్ చేయడం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇష్టం లేదని అన్నారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి ఫోన్లు వచ్చాయని.. తన భర్త కొండా మురళీకి పదవి ఇస్తామనే సంకేతాలు వెలువడ్డాయని చెప్పుకొచ్చారు.

**రేవంతన్న మాస్ లీడర్**

రేవంత్‌రెడ్డి లాంటి మాస్ లీడర్ కాంగ్రెస్‌కు అవసరమని చెప్పిన మొదటి వ్యక్తిని తానేనని కొండా సురేఖ తెలిపారు. రేవంత్‌రెడ్డి రైతుల కోసం పాదయాత్ర చేశారని, అదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని, తనకు మంత్రి పదవి వచ్చిందన్నారు. తనకు ఇచ్చిన మూడు శాఖల్లో ఎక్కడా అవినీతికి పాల్పడలేదని గుర్తు చేశారు. పదవి అనేది ఓ అలంకారం మాత్రమేనని చెప్పారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో వరంగల్‌లోని 25 డివిజన్‌ల్లో విజయం సాధిస్తామని జోస్యం చెప్పారు. అయితే కొన్ని పరిస్థితుల వల్ల తాము పార్టీ మారామని చెప్పారు. ఈ పార్టీలో గెలిచి ఆ పార్టీలో చేరే అనైతిక రాజకీయాలు చేయలేదన్నారు. సోకాల్డ్ నేతలు.. విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారంటూ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపై కొండా సురేఖ పరోక్షంగా విరుచుకుపడ్డారు. కార్పొరేటర్‌గా కూడా గెలువలేని సారయ్య తనను రాజీనామా చేయమంటున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలంటూ సారయ్యను ఈ సందర్భంగా హెచ్చరించారు. తనను బర్తరఫ్ చేసిన రోజు అల్లర్లు చేయాలా? అని అభిమానులు అడిగారని.. కానీ తాము వద్దన్నామని చెప్పారు. తమ ఆదేశాలు పాటించిన అభిమానులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం**

పదవులు వస్తాయి, పోతాయని కొండా సురేఖ చెప్పారు. తమకు అండగా ఉన్న కార్యకర్తలకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. గతంలో ఓ నాయకుడిని నమ్ముకుంటే అండగా ఉండే వారని.. కానీ ప్రస్తుతం రాజకీయాల్లో అలాంటి పరిస్థితి లేదని పెదవి విరిచారు. నమ్ముకున్న వైఎస్ రాజశేఖరరెడ్డి కోసం తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడే ఈ జిల్లా గుంటనక్కలు వెంటబడ్డాయని పేర్కొన్నారు. అప్పటి మంత్రి బస్వరాజు సారయ్యను ఓడించేందుకు కేసీఆర్ తమకు వరంగల్ టికెట్ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. సారయ్య కుటుంబం ఇంకా భూకబ్జాలు, వసూళ్లకు పాల్పడుతుందని విమర్శించారు. పరకాలను తాము విడిచిపెట్టగానే ఆ స్థానంలో బీఆర్ఎస్ నేత ధర్మారెడ్డి పాగా వేసి కోట్లాది రూపాయలు సంపాదించి.. నాయకులను కొన్నాడని మాజీ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు.





# రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలి

- భూగర్భ బొగ్గు గనుల్లో భద్రతకు ప్రాధాన్యత
- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు
- వీకే కోల్ మైన్‌ను పరిశీలించిన అధికారులు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి వ్యాప్తంగా ఉన్న భూగర్భ బొగ్గు గనులలో భద్రతకు యాజమాన్యం అధిక ప్రాధాన్యత ఇస్తుందని సింగరేణి డైరెక్టర్ (పి అండ్ పీ)కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయన కొత్తగూడెం ఏరియాలోని వీకే కోల్ మైన్ ను సందర్శించి గని కార్యకలాపాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గనిలో కొనసాగుతున్న కార్యకలాపాలను ప్రత్యక్షంగా పరిశీలించిన డైరెక్టర్ భద్రతా చర్యలు సేఫ్టీ ప్రికాషన్స్ బొగ్గు డిస్పాచ్ స్థితి ఓవర్‌బర్డెన్ రిమూవల్ పనితీరు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గనిలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ముందస్తు భద్రతా చర్యలు చేపడుతూ సేఫ్టీ ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి డిస్పాచ్ లక్ష్యాలను సాధించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఓబీఆర్ పనితీరును మెరుగుపరచడం ద్వారా భవిష్యత్ ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గని కార్యకలాపాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి సత్వర పరిష్కారాలు చూపాలని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్పత్తి ఉత్పాదకతను పెంపొందించడంతో పాటు భద్రతకు పెద్దపీట వేయాలని డైరెక్టర్ సూచించారు.సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తో పాటు ఏరియా జనరల్ మేనేజర్ వెంకట రమణ, వీకేసీఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.శంకర్, ఎస్ఎస్ఓ(సర్వే) వెంకటేశ్వర్లు, మేనేజర్ (ఫారెస్ట్రీ) రమణ రెడ్డి, ఎస్టేట్స్ ఇతర అధికారులు పాల్గొన్నారు.




# మట్టి వినాయకులతో.. కాలుష్యానికి కళ్లెం!

**సత్తుపల్లి,** మహా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని సింగరేణి యాజమాన్యం పిలుపునిచ్చింది. వినాయక చవితి సందర్భంగా సత్తుపల్లి ఏరియా జీఎం ఎస్.వెంకటాచారి ఆదేశాల మేరకు జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, జేవీఆర్ బొగ్గు క్రషింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)లో ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు అధికారి ఎన్‌వీఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసీ ప్రాజెక్టు అధికారి ఏఎల్ఎస్‌వీ సునీల్‌వర్మ, జేవీఆర్ సీహెచ్‌పీ ఎస్ఈ (ఈఅండ్ఎం) పి.సాయినాథ్ ఉద్యోగులకు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మట్టి వినాయక విగ్రహాలు ప్రకృతికి అనుకూలమైనవని తెలిపారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. చెరువులు, వాగులు, కాలువల్లో నిమజ్జనం అనంతరం రసాయన పదార్థాలు నీటిలో కలవడం వల్ల జలచరాలకు, పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పండుగ సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ప్రకృతిని పరిరక్షించవచ్చని అధికారులు అన్నారు. మట్టి నీటిలో సులభంగా కలిసిపోవడంతో పర్యావరణంపై ప్రతికూల ప్రభావం ఉండదన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన నీరు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన పద్ధతులను పాటించాలని సూచించారు. . పండుగల్లో ఆనందంతో పాటు పర్యావరణ బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజినీర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఓఎం బెజ్జంకి రాజేశ్వరరావు, పర్యావరణ విభాగం ఇన్‌చార్జి సంతోష్‌కుమార్, సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, పిట్ కార్యదర్శి ఉపేంద్రచారి, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మురళీకృష్ణ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గల్లీ గల్లీలో కొలువుదీరిన గణపయ్యలు

- గ్రేటర్ వరంగల్ లో ఆధ్యాత్మిక శోభ
- డీజే లకు పోలీసులు బ్రేక్
- గణపతి మండపాలతో ఓరుగల్లు ముస్తాబు
- పోలీసుల నిఘా.. ఆంక్షల మధ్య గణేష్ నవరాత్రులు షురూ



**వరంగల్, మహా :** ఓరుగల్లు నగరం గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సరికొత్తగా ముస్తాబైంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతీ గల్లీలో గణపయ్యలు కొలువుదీరుతున్నారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట తదితర త్రినగరాల పరిధిలోని ప్రతి ప్రధాన కూడలి, ప్రతి వీధి భక్తిభావంతో పులకించిపోతోంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ కలిసి మండపాల ఏర్పాటులో, విగ్రహాల ప్రతిష్ఠాపనలో నిమగ్నమయ్యారు. నగరంలో దాదాపు వేల సంఖ్యలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఉత్సవ కమిటీలు సర్వం సిద్ధం చేశాయి. అయితే, ఈ ఏడాది ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య ఒక సరికొత్త ఆంక్షల వివాదం పై నగరం వేడెక్కుతోంది. అదే డీజేల పై నిషేధం. ఓరుగల్లు వీధుల్లో వినాయక సందడి ఈ ఏడాది గ్రేటర్ వరంగల్ వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మట్టి గణపతుల నుంచి మొదలుకొని 51 అడుగుల భారీ గణనాథుడి రూపాల వరకు రకరకాల నమూనాలలో వినాయక విగ్రహాలు మండపాలకు చేరుకున్నాయి. ఖిలా వరంగల్, పోచమ్మ మైదాన్, మట్టెవాడ, ఎల్లం బజార్ వంటి చారిత్రక నేపథ్యం వ్యాపార కేంద్రాలలో భారీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. హనుమకొండలోని వేయి స్తంభాల గుడి ప్రాంతం, అదాలత్ జంక్షన్, నయీంనగర్, సుబేదారి, అంబేద్కర్ జంక్షన్, కాకతీయ విశ్వవిద్యాలయ ప్రాంగణం పరిసరాల్లో వినూత్నమైన నమూనాలు, రంగురంగుల విద్యుత్ దీపాలు, తోరణాలతో మండపాలను అద్భుతంగా ముస్తాబు చేశారు.కాజీపేట, రైల్వే కాలనీ, ఫాతిమా నగర్ కూడళ్లలో యువత ఉత్సాహంగా రాత్రింబవళ్లు శ్రమించి మండపాలను అలంకరించారు.తొమ్మిది రోజుల పాటు నగరంలో పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం నెలకొననుంది. నగరవ్యాప్తంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

**డీజేలకు బ్రేక్.. నిబంధనలు కఠినం**

ఉత్సవాలు ఒకవైపు ఊపందుకుంటుంటే, మరోవైపు పోలీసులు డీజే, ధ్వని వ్యవస్థల పై విధించిన ఆంక్షలు ఉత్సవ కమిటీలకు, యువతకు మింగుడుపడటం లేదు. నగరంలో శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు, వృద్ధులు, రోగుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఈసారి డీజేల వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. న్యాయస్థానాల ఆదేశాల ప్రకారం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మైకులు పూర్తిగా బంద్ చేయాలని, నివాస ప్రాంతాలలో శబ్ద తీవ్రత నిబంధనల మేరకే ఉండాలని స్పష్టం చేశారు. కేవలం సాధారణ మైకులు, సంప్రదాయ వాయిద్యాలైన మంగళ వాయిద్యాలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి భారీ డీజేల గోడలు పెడితే కఠిన చర్యలు తప్పవని, బాధ్యులపై కేసులు నమోదు చేసి సామాగ్రిని స్వాధీనం చేసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

**హిందూ పండుగలకేనా ఈ ఆంక్షలు?**

ఆంక్షల పై భక్తులు, హిందూ ఉత్సవ కమిటీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇలాంటి ఆంక్షలు కేవలం హిందూ పండగలకేనా ఆంక్షలు? అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా, నగరంలో బహిరంగంగా చర్చలు నడుస్తున్నాయి. ఉత్సవ నిర్వాహకులు, స్థానిక యువత దీని పై పలు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇతర మతాల పండుగలు, రాజకీయ ర్యాలీలు, ఊరేగింపులు జరిగినప్పుడు లేని శబ్ద కాలుష్యం.. కేవలం గణేశుడి నవరాత్రులు, నిమజ్జనం పూజలప్పుడే అధికారులకు గుర్తుకొస్తుందా? అని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే పండుగను ఉత్సాహంగా, వైభవంగా జరుపుకోవాలనుకునే యువత ఆశల పై ఈ ఆంక్షలు నీళ్లు చల్లుతున్నాయని మండిపడుతున్నారు. కేవలం రాత్రి వేళల్లో శబ్ద పరిమితి విధించాలే తప్ప, పగటిపూట కూడా పూర్తిగా డీజేలను నిషేధించడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**నిమజ్జన మార్గాల పై ప్రత్యేక నిఘా**

ముఖ్యంగా గణేష్ నిమజ్జనం రోజున వరంగల్ లో కోలాహలం అంబరాన్నంటుతుంది. నగరంలోని వడ్డేపల్లి చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, పద్మాక్షమ్మ గుట్ట చెరువు, ఉర్సు చెరువు వంటి ప్రధాన నిమజ్జన ఘాట్లకు విగ్రహాలను తరలించే మార్గాలలో పోలీసులు డీజేల పై గట్టి నిఘా పెట్టనున్నారు. ఎల్లం బజార్, చౌరస్తా, జెపిఎన్ రోడ్ మీదుగా సాగే నిమజ్జన ఊరేగింపులలో డీజేల వాడకాన్ని పూర్తిగా నియంత్రించేందుకు తనిఖీ కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. సమన్వయం కోసం అధికారుల ప్రయత్నం ఈ వివాదం పెద్దది కాకుండా చూసేందుకు వరంగల్ పోలీసులు, మున్సిపల్ అధికారులు ఉత్సవ కమిటీలతో ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. పండుగ సంప్రదాయ బద్ధంగా, ప్రశాంత వాతావరణంలో జరగాలన్నదే తమ ఉద్దేశమని అధికారులు చెప్తున్నారు. అధిక శబ్దాల వల్ల గుండెజబ్బులు ఉన్నవారు, ఆసుపత్రుల్లోని రోగులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని.. దీనిని ఏ ఒక్క మతానికో ఆపాదించవద్దని వారు కోరుతున్నారు. ఏది ఏమైనప్పటికీ, ఆంక్షల నీడలోనైనా బొజ్జ గణపయ్యను అత్యంత వైభవంగా ఆహ్వానించేందుకు ఓరుగల్లు ప్రజలు సిద్ధమయ్యారు. మరి ఈ తొమ్మిది రోజుల పాటు డీజేల వివాదం ఎంతవరకు సద్దుమణుగుతుందో, నిమజ్జనం నాటికి ఎలాంటి పరిస్థితులు ఉంటాయో వేచి చూడాలి.

# మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ

**భద్రాచలం/మణుగూరు, మహా:** పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి ప్రతిమలనే వినియోగించాలని భద్రాచలం ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శివనాయక్ సూచించారు. వినాయక చవితిని పురస్కరించుకుని భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయవాది పి.వి. కృష్ణమాచారి సహకారంతో జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శివనాయక్ ప్రతిమలను పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. యువత, విద్యార్థులు పర్యావరణహిత పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## బాడీ షేమింగ్‌పై ఉపాసన ఘాటు స్పందన

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ సతీమణిగా మాత్రమే కాకుండా, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పారిశ్రామికవేత్తగా ఉపాసన కొణిదెల ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వ్యాపార రంగంలో బాధ్యతలు నిర్వర్తిస్తూ, కుటుంబ జీవితాన్ని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఆమె.. తాజాగా తన జీవితంలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా పెళ్లి తర్వాత తన శరీరాకృతిపై వచ్చిన విమర్శలు తనను తీవ్రంగా బాధించాయని ఆమె వెల్లడించారు.రామ్‌చరణ్‌తో వివాహం జరిగిన సమయంలో కొందరు తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఉపాసన గుర్తుచేసుకున్నారు. స్టార్ హీరోకు భార్యగా ఉండేందుకు తాను సరిపోనంటూ, తన శరీరాకృతిని ఉద్దేశించి కామెంట్లు చేసిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. ఆ సమయంలో అలాంటి మాటలు తనపై మానసికంగా తీవ్ర ప్రభావం చూపాయని తెలిపారు. అయితే కాలక్రమేణా ఇతరుల అభిప్రాయాల కంటే తన గురించి కుటుంబ సభ్యులు, తనకు దగ్గరైన వ్యక్తులు ఏమనుకుంటున్నారనేదే ముఖ్యమని అర్థం చేసుకున్నానని చెప్పారు. తన బరువు పెరగడానికి కూడా ఒక ప్రత్యేకమైన కారణం ఉందని ఉపాసన వివరించారు. ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన సమయంలో కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటంతో ఒంటరితనం, ఇంటి జ్ఞాపకాలతో ఇబ్బంది పడ్డానని తెలిపారు. ఆ సమయంలో ఎదురైన మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు తెలియకుండానే ఎక్కువగా ఆహారం తీసుకునే అలవాటు ఏర్పడిందని చెప్పారు. దాని ఫలితంగా చిన్న వయసులోనే తన బరువు గణనీయంగా పెరిగిందని వెల్లడించారు. ఆ తర్వాత ఆరోగ్యంపై దృష్టి పెట్టి జీవనశైలిలో మార్పులు చేసుకున్నట్లు ఉపాసన తెలిపారు. బరువు తగ్గేందుకు కేవలం డైట్‌పై ఆధారపడకుండా, రోజువారీ అలవాట్లను మార్చుకోవడంపై దృష్టి పెట్టానని చెప్పారు. ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడంతో పాటు ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలను తీసుకోవడం, క్రమం తప్పకుండా నడక సాగించడం వంటి వాటిని పాటించానని గుర్తుచేసుకున్నారు. రోజుకు సుమారు 10 వేల అడుగులు నడిచేలా తన దినచర్యను మార్చుకున్నానని తెలిపారు. ప్రస్తుతం తన ఆరోగ్యంతో పాటు రామ్‌చరణ్ ఫిట్‌నెస్‌పై కూడా ఇద్దరూ కలిసి శ్రద్ధ చూపుతున్నామని ఉపాసన చెప్పారు. వర్కవుట్స్, ఆహార నియమాలను ఇద్దరూ కలిసి పాటిస్తూ



ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తనకు ఎదురైన విమర్శలకు మాటలతో కాకుండా ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండటం ద్వారా సమాధానం ఇచ్చానని ఆమె అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో తనకు ఎదురవుతున్న నిద్ర సమస్య గురించి కూడా ఉపాసన మాట్లాడారు. తాను, తన తల్లి నిద్రకు సంబంధించిన ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని చెప్పారు. తగినంత నిద్ర లేకపోవడం వల్ల రోజువారీ జీవితంలో అలసట, ఏకాగ్రతకు సంబంధించిన సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంచాలనే ఉద్దేశంతో భవిష్యత్తులో 'స్లీప్ క్లినిక్' ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. ఆరోగ్యం విషయంలో కేవలం మందులపైనే ఆధారపడకుండా, మన ఆలోచనా విధానం, జీవనశైలి కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఉపాసన అన్నారు. మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన కార్యక్రమాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. ఒకప్పుడు తన శరీరాకృతిపై వచ్చిన విమర్శలు తనను బాధించినప్పటికీ.. వాటినే సవాలుగా తీసుకుని తనలో మార్పు తీసుకువచ్చిన ఉపాసన ప్రయాణం ఇప్పుడు చాలామందికి ప్రేరణగా మారింది. ఇతరుల వ్యాఖ్యలతో కుంగిపోకుండా, ఆరోగ్యం మరియు ఆత్మవిశ్వాసంపై దృష్టి పెట్టాలనే సందేశాన్ని ఆమె ప్రయాణం అందిస్తోంది.





## రూ.2 కోట్ల సినిమాకు రూ.236 కోట్ల వసూళ్లు

కేవలం రూ.2 కోట్లలోపే తెరకెక్కిన 'హనుమాన్ అంశ్' సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకుంది. ఆగస్టు 7న కేవలం 25 స్క్రీన్లలో విడుదలైన ఈ చిత్రం తొలిరోజు సుమారు రూ.10 లక్షలు మాత్రమే రాబట్టింది. తొలి వారం రూ.1.08 కోట్లకు, రెండో వారంలో మరో రూ.40 లక్షల వరకు వసూళ్లు వచ్చాయి. దీంతో సినిమా పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని చాలామంది భావించారు. అయితే మూడో వారం నుంచి వచ్చిన పాజిటివ్ మౌత్ టాక్‌తో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. థియేటర్లు పెరగడంతో పాటు కలెక్షన్లు కూడా వేగంగా పుంజుకున్నాయి.37వ రోజుకు ఈ మూవీ ఇండియాలో రూ.192 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించగా, ప్రపంచవ్యాప్తంగా రూ.236 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టినట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం రూ.300 కోట్ల మార్క్‌పై కూడా అంచనాలు వ్యక్తమవుతున్నాయి.ఈ విజయంతో 21 ఏళ్ల యువ నిర్మాత అనుప్రియ నగర్ పేరు చర్చనీయాంశమైంది. యూనివర్సిటీ ఆఫ్ బాత్‌లో ఎకనామిక్స్ చదివిన ఆమె, యూకేలో సంపాదించిన పొదుపు మొత్తాన్ని ఈ చిత్రంపై పెట్టుబడిగా పెట్టినట్లు సమాచారం. భారీ విజయంతో వచ్చిన డబ్బును పేద పిల్లల సహాయం, సేవా కార్యక్రమాలకు వినియోగించాలని భావిస్తున్నట్లు ఆమె చెప్పడం ప్రశంసలు అందుకుంటోంది.ఇక రూ.100 కోట్ల ఓటీటీ డీల్ వచ్చిందన్న ప్రచారాన్ని అనుప్రియ ఖండించారు. అలాంటి ఆఫర్ ఏదీ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం థియేటర్లలో ప్రేక్షకుల ఆదరణే తమకు ముఖ్యమని పేర్కొన్నారు.

## మెస్మరైజ్ చేస్తున్న తేజస్వి

తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి తేజస్వి మదివాడ తనదైన నటన, ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పాత్ర ఏదైనా అందులో ఒదిగిపోయి తనదైన శైలిలో మెప్పించడం ఆమె ప్రత్యేకత. నటనతో పాటు ఫ్యాషన్, ఫొటోషూట్లలోనూ తేజస్వి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు.'ఐస్‌క్రీమ్', 'కేరింత', 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైన తేజస్వి.. కాలక్రమేణా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తనలోని నటనా ప్రతిభను చాటుకున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనూ కనిపిస్తూ తన కెరీర్‌లో వైవిధ్యాన్ని చూపిస్తున్నారు. వెండితెరతో పాటు డిజిటల్ వేదికలపైనా తన ఉనికిని చాటుకుంటూ ముందుకు సాగుతున్నారు.ఇటీవల వచ్చిన క్రైమ్ థ్రిల్లర్ 'హైడ్ అండ్ సీక్' (2024)లోనూ తేజస్వి కీలక పాత్రలో కనిపించారు. ఉత్కంఠభరితమైన కథనంలో ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. విభిన్నమైన కథలు, పాత్రలపై ఆసక్తి చూపుతున్న ఆమె.. తన కెరీర్‌ను కొత్త కోణాల్లో ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇక తాజాగా తేజస్వి చేసిన ఫొటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది.

నలుపు రంగు వెల్వెట్ దుస్తుల్లో ఆమె ఎంతో స్టైలిష్‌గా కనిపించారు. డ్రమాటిక్ వేవీ హెయిర్‌స్టైల్, మెడలో ధరించిన ప్రత్యేకమైన గోల్డ్ టెంపుల్ డిజైన్ చోకర్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. సంప్రదాయ ఆభరణానికి ఆధునిక ఫ్యాషన్ టచ్ జోడించడంతో ఈ లుక్ ప్రత్యేకంగా నిలిచింది.ఈ ఫొటోల్లో తేజస్వి చూపించిన కాన్ఫిడెన్స్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సింపుల్‌గా కనిపిస్తూనే గ్లామర్, ఎలిగెన్స్, బోల్డ్‌నెస్‌ను సమపాళ్లలో ప్రదర్శించిన ఆమె ఫ్యాషన్ సెన్స్‌కు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో అభిమానులు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. నటనతో పాటు తన ప్రత్యేకమైన స్టైల్‌తోనూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న తేజస్వి.. రాబోయే రోజుల్లో మరిన్ని విభిన్నమైన ప్రాజెక్టులతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. తెరపై పాత్రలతో మెప్పించడంతో పాటు ఆఫ్ స్క్రీన్ ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తోనూ వార్తల్లో నిలుస్తూ తనకంటూ ప్రత్యేకమైన క్రేజ్‌ను కొనసాగిస్తున్నారు.






## 'విశ్వంభర' ఓటీటీ డీల్‌పై ఆసక్తికర చర్చ

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'విశ్వంభర'. 'బింబిసార'తో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న వశిష్ఠ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ సోషియో ఫాంటసీ మూవీపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్, ఫాంటసీ ప్రపంచం, చిరంజీవి పాత్రను దర్శకుడు చూపించబోయే విధానంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అనుకున్న దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల తేదీ విషయంలో ఆలస్యం ఏర్పడింది. దీనికి తోడు డిజిటల్ హక్కుల విషయంలోనూ కొంతకాలంగా చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. నిర్మాతలు ఆశిస్తున్న మొత్తానికి, ఓటీటీ సంస్థలు అందిస్తున్న ఆఫర్లకు మధ్య వ్యత్యాసం ఉండటంతో డీల్ ఖరారు కావడానికి సమయం పట్టినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరిగింది.తాజాగా ఈ విషయంలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీ లివ్ 'విశ్వంభర' డిజిటల్ హక్కులను సొంతం చేసుకునేందుకు ఆసక్తి చూపినట్లు సమాచారం. నిర్మాతల అంచనాలకు దగ్గరగా ఆర్థిక ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని, ఇరు వర్గాల మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ఓటీటీ డీల్ పూర్తయితే సినిమా విడుదలకు సంబంధించిన తదుపరి ప్రకటనకు మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు. కొత్త విజువల్ పోస్టర్‌తో పాటు థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.ఇప్పటికే 'విశ్వంభర' విడుదలకు సంబంధించి డిసెంబర్ 3, సంక్రాంతి వంటి తేదీలు ప్రచారంలోకి వచ్చాయి. డిసెంబర్‌లో సినిమా వస్తే ఇతర ప్రాజెక్టుల విడుదల తేదీల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' కూడా డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రావాలని ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో చిరంజీవి, ప్రభాస్ చిత్రాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఉంటుందా? అనే ఆసక్తి నెలకొంది. అయితే తుది విడుదల తేదీ విషయంలో హీరోల నిర్ణయం కంటే నిర్మాతల వ్యాపార ప్రణాళికలు, మార్కెట్ పరిస్థితులే కీలకంగా మారతాయి. ప్రస్తుతం 'విశ్వంభర' ఓటీటీ డీల్, రిలీజ్ డేట్‌పై అధికారిక ప్రకటన కోసం మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## 'ఇరుముడి'తో శివ నిర్వాణకు పెరిగిన క్రేజ్

'ఇరుముడి' సాధించిన విజయంతో దర్శకుడు శివ నిర్వాణ పేరు మరోసారి టాలీవుడ్‌లో గట్టిగా వినిపిస్తోంది. భావోద్వేగాలను సహజంగా తెరకెక్కించడంలో ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. 'నిన్ను కోరి', 'మజిలీ' చిత్రాలు ఆయనలోని ఎమోషనల్ టచ్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశాయి. అయితే తాజాగా 'ఇరుముడి'తో ఆ భావోద్వేగానికి కమర్షియల్ విజయాన్ని కూడా జోడించుకున్నారు. ఈ సినిమా రూ.200 కోట్ల మార్క్‌ను దాటడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది.ఇప్పటివరకు శివ నిర్వాణ నాని, నాగచైతన్య, విజయ్ దేవరకొండ, రవితేజ వంటి హీరోలతో సినిమాలు చేశారు. వీరందరికీ మంచి మార్కెట్ ఉన్నప్పటికీ.. ఆయన ఇంకా ఓ టాప్ స్టార్‌తో భారీ స్థాయిలో సినిమా చేయలేదు. 'మజిలీ' తర్వాత వచ్చిన 'టక్ జగదీష్', 'ఖుషి' ఆశించిన ఫలితాలను ఇవ్వకపోయినా.. 'ఇరుముడి'తో తిరిగి సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చారు.ఈ సినిమాలో తండ్రి-కూతురు మధ్య సాగే భావోద్వేగ కథనం ప్రేక్షకులను ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో థ్రిల్లర్ అంశాలను కూడా దర్శకుడు సమర్థంగా మిళితం చేయడం సినిమాకు ప్లస్‌గా మారింది. రవితేజ ఇమేజ్‌కు భిన్నమైన ఎమోషనల్ కోణాన్ని చూపించడం కూడా శివ నిర్వాణకు మంచి పేరు తెచ్చింది. ఇటీవల చిరంజీవి, రామ్‌చరణ్



'ఇరుముడి' త్రబృందాన్ని అభినందించడం కూడా ఆసక్తిని పెంచింది.ఇప్పుడు శివ నిర్వాణ తదుపరి అడుగు ఏమిటన్నదే అసలు ప్రశ్న. మరోసారి తనకు పరిచయమైన రేంజ్ హీరోతో సినిమా చేస్తారా? లేక 'ఇరుముడి' విజయంతో వచ్చిన ఊపును ఉపయోగించుకుని ఓ టాప్ స్టార్‌తో భారీ ప్రాజెక్ట్ తెరకెక్కిస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. స్టార్ హీరోతో అవకాశం వస్తే బడ్జెట్, స్కేల్ భారీగా పెరిగే అవకాశం ఉంది. అప్పుడు తన ఎమోషనల్ స్టైల్‌ను ఎంత పెద్ద క్యాన్వాస్‌పై చూపిస్తారన్నది చూడాలి. ప్రస్తుతం శివ నిర్వాణ కెరీర్‌లో ఇదొక కీలక దశగా మారింది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com